News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in


సంపుటి : 03 | సంచిక :71 | ఖమ్మం | సోమవారం, ఏప్రిల్ 28, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# తెలంగాణకు కాంగ్రెసే విలన్

కేసీఆర్ పిలుపుతో.. యావత్ తెలంగాణ కదిలింది..
ఓరుగల్లు గడ్డ మీద శపథం చేసింది!
నిన్ను గద్దె దించేదాకా వదలము..
ఇక కాస్కో.. రేవంతూ!

- వరంగల్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ • పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం.
- తెలంగాణ ఉద్యమ ప్రస్థానం, ఎదురైన అవమానాలు ప్రస్తావించిన గులాబీ బాస్
- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అద్భుతంగా నిర్మించామని వ్యాఖ్య.
- అమరవీరులకు నివాళి, వరంగల్ గడ్డ ప్రాశస్త్యంపై వ్యాఖ్యలు



- గోల్‌మాల్ చేయడంలో.. అబద్ధాల్లో దాన్ని మించింది లేదు
- కమీషన్లు తీసుకోవడం.. సంచులు మోయడమే ఆ పార్టీ పని
- 420 హామీల అమలులో వైఫల్యం
- ప్రభుత్వాన్ని మేం పడగొట్టం.. ప్రజలే వారి వీపులు సాపు చేస్తారు
- పోలీసులూ.. వచ్చేది మా ప్రభుత్వమే.. తప్పుడు కేసులు వద్దు..
- నేను బయటికొస్తా.. పోరాడతా
- 11 ఏళ్లలో 11 రూపాయలు కూడా ఇవ్వని భాజపా
- ఆపరేషన్ కగార్‌ను కేంద్రం నిలిపివేయాలి
- భారాస రజతోత్సవ సభలో కేసీఆర్

వివరాలు 2లో..

## ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల్లో..
# 53% మంది అనర్హులే..

### 41.15 లక్షల మందికి అర్హత లేదు..
### 36.03 లక్షల మంది మాత్రమే అర్హులు



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం 'ప్రజాపాలన'లో వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇళ్ల కోసం మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేయగా.. వీరిలో 36.03 లక్షల (46.7 శాతం) మంది అర్హులని గుర్తించారు. మిగతా 41.15 లక్షల (53.3 శాతం) మందిని అనర్హులుగా తేల్చారు. అనర్హులంతా దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారేనని నిర్ధారించారు. అర్హులు, అనర్హుల వివరాలను గృహ నిర్మాణశాఖ ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలుగా సిద్ధం చేసి పెట్టుకుంది.

వివరాలు 2లో..

# అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

- మీరేం చేశారో.. మేమేం చేస్తున్నామో ప్రతి అంశంపై మాట్లాడదాం
- కాళేశ్వరం ఈఎన్‌సీ అవినీతే రూ.200 కోట్లు.. కేసీఆర్ కుటుంబం ఎంత సంపాదించిందో?
- తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్‌లా కనిపిస్తోందా?
- కేసీఆర్‌పై మంత్రులు పొంగులేటి, సీతక్క, జూపల్లి, పొన్నం ధ్వజం



భారాస అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు ఏ ఒక్క విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రులు విమర్శించారు. అధికారంపై కేసీఆర్ పగటికలలు కంటున్నారని.. ఈ మూడున్నరేళ్లతోపాటు మరో పదేళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కడుపులో అంతా విషం పెట్టుకుని ఎల్కతుర్తి బహిరంగసభలో కాంగ్రెస్‌పై అసత్యప్రచారం చేశారని మండిపడ్డారు.భారాస రజతోత్సవ సభ అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ని విలన్‌లా సంబోధించిన

వివరాలు 2లో..

## తెలంగాణ నూతన సీఎస్ గా
# కె.రామకృష్ణారావు

- ప్రస్తుత సీఎస్ శాంతికుమారి పదవీకాలం ఏప్రిల్ 30తో ముగింపు
- ముందుగానే నూతన సీఎస్ నియామక ప్రక్రియ పూర్తి చేసిన తెలంగాణ సర్కారు
- కె.రామకృష్ణారావు 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.

వివరాలు 2లో..

# యుద్ధానికి మేం రెడీ..

### రక్షణ మంత్రితో CDS అనిల్ చౌహాన్



భారత్, పాక్ మధ్య యుద్దానికి మూహూర్తం ఖరారయినట్లు తెలుస్తోంది. నిన్న యుద్ధానికి మేం సిద్ధం అంటూ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కలిసిన కొన్ని గంటల్లోనే తాజాగా చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కూడా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో భేటీ అవడం..పాక్ తో యుద్ధం మొదలైనట్లే అనే వార్తలు వినిపిస్తున్నాయి. ఆదివారం (ఏప్రిల్ 27) చీఫ్ ఆఫ్ జనరల్

వివరాలు 2లో..

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ భార్య

- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయ ప్రసవం
- గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) డెలివరీ
- ఆరోగ్యవంతమైన మగ శిశువుకు జన్మనిచ్చిన విజయ
- గర్భం దాల్చినప్పటి నుంచీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు
- ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచేలా కలెక్టర్ చర్య



ప్రభుత్వ వైద్య సేవలపై సామాన్య ప్రజల్లో నమ్మకాన్ని పెంచే దిశగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదర్శనీయమైన నిర్ణయం తీసుకున్నారు. తన భార్య విజయ ప్రసవాన్ని గోదావ రిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) చేయిం చారు. ఆమె ఆరోగ్యవం తమైన

వివరాలు 2లో..

## ఉగ్రదాడి దోషులను
# వదిలిపెట్టం

- పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్ర స్పందన
- దాడికి పాల్పడిన వారికి, కుట్రదారులకు కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక
- బాధితుల కుటుంబాలకు తప్పక న్యాయం చేస్తామని హామీ
- కశ్మీర్‌లో శాంతి, అభివృద్ధిని చూసి శత్రువులు కుట్ర పన్నారు
- ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే కీలకమని మోదీ ఉద్ఘాటన



జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమా యక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ అమానవీయ చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుకున్న కుట్ర దారులకు అత్యంత కఠినమైన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బాధితుల కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో

వివరాలు 2లో..

# తెలంగాణకు కాంగ్రెసే విలన్

తెలంగాణకు ఆనాడైనా, ఈనాడైనా, ఏనాడైనా నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని భారత రాష్ట్ర సమితి (భారాస) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణను 1956లో బలవంతంగా ఆంధ్రాతో కలిపింది, 1969 ఉద్యమ సమయంలో తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చిందీ కాంగ్రెస్సేనని విమర్శించారు. గోల్‌మాల్ చేయడంలో అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ నాయకుల్ని మించిన వారు లేరని దుయ్యబట్టారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే అది నిండా మోసం చేసిందని విమర్శించారు. భారాస రజతోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బహిరంగసభలో కేసీఆర్ ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన వారికి సంతాపసూచకంగా.. సభ ఆరంభంలో ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు. తాము అధికారంలో ఉన్న పదేళ్లలో తెలంగాణను ధగధగలాడించామని.. అందరూ ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ వైఫల్యాల వల్ల 2014 కంటే ముందురోజులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై తాను కూడా ఊరుకోనని.. పోరాటాలకు బయల్దేరతానని తెలిపారు. భాజపా వైఖరి అంతా భ్రభ్రాజమానం.. భజగోవిందం, శుష్కప్రియాలు, శూన్యహస్తాలుగా ఉందని, కేంద్రంలో ఉన్న ఆ పార్టీ తెలంగాణకు 11 ఏళ్లలో 11 రూపాయలు కూడా ఇవ్వలేదని, రాష్ట్రంపై మోదీ ఇంకా విషం చిమ్ముతూనే ఉన్నారని ఆరోపించారు.

**జననీ జన్మభూమిశ్చ స్ఫూర్తితో...**

"రామరావణ యుద్ధం పూర్తయ్యాక.. 'లంక చాలా సువర్ణమయంగా ఉంది.. ఇక మనం అయోధ్యకు వెళ్లడమెందుకు? ఇక్కడి నుంచే పరిపాలన చేద్దాం' అని లక్ష్మణుడు, ఇతర యోధులు అంటే.. శ్రీరామచంద్రుడు ఒప్పుకోలేదు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని హితవు పలికారు. కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం ఏదీ ఉండదని దాని అర్థం. మనకు ఆయన సూక్తులే స్ఫూర్తి. ఒకనాడు అత్యంత గందరగోళ పరిస్థితుల్లో.. ఆత్మహత్యలకు, వలసలకు నిలయంగా, వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న తెలంగాణను ఎట్టి పరిస్థితుల్లోనూ విముక్తి చేయాలని సంకల్పించాం. స్వరాష్ట్రం సాధించాలని, జనని, జన్మభూమిని మించింది లేదని చెప్పి నేను ఒక్కడిగా బయల్దేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టా.

**ఆది నుంచీ కాంగ్రెస్ దగా..**

తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రం పేరుతో ఉన్ననాడు.. బలవంతంగా ఆంధ్రాతో కలిపిందే జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రత్యేక రాష్ట్రం కోసం 1969లో ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చి చంపింది ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. 2001 నుంచి మరోసారి మనం ఉద్యమాన్ని ప్రారంభించి, విజృంభిస్తే.. మన బలాన్ని, ఊపును చూసి.. అదే కాంగ్రెస్ నంగనాచిలా వచ్చి.. పొత్తుపెట్టుకొని తెలంగాణ ఇస్తామని నమ్మబలికిన సంగతి మీకు తెలుసు. రాష్ట్రం ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తూ.. 14 సంవత్సరాలు ఏడిపించారు. వాళ్ల ఎత్తుగడలు, మోసాలకు దీటుగా నేను.. జయశంకర్ సార్ వ్యూహాలు రచిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాం. జాతీయస్థాయిలో విపక్షాలన్నిటినీ కూడగట్టాం. చివరకు పార్లమెంటులో అవన్నీ కలిసి మన తరఫున కాంగ్రెస్ గొంతు పట్టుకుంటే.. అప్పుడు ఆ పార్టీ దిగి వచ్చి తెలంగాణ కోసం ప్రకటన చేసిన విషయం మీకు తెలుసు. తర్వాత మరోసారి మడమ తిప్పి, ప్రకటన వెనక్కి తీసుకొన్నదీ మనకు తెలుసు. తర్వాత సకలజనుల సమ్మె, సాగరహారాలు, వంటావార్పులు.. ఇలా అనేక రూపాల్లో విజృంభించి భీకరమైన పోరాటం చేశాం. మూడేళ్ల తర్వాత రాజకీయ అవసరం ఏర్పడి.. తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. వారికి ఇష్టం లేకపోయినా తెలంగాణ సృష్టించిన సుడిగాలులను తట్టుకోలేకనే రాష్ట్రం ఇచ్చిన విషయం మీకు తెలుసు. ఉద్యమ సమయంలో ఆనాటి కాంగ్రెస్, తెదేపాల్లో ఉన్న నాయకులు పదవుల కోసం పెదవులు మూసుకున్నారు. ఏనాడూ గొంతెత్తి కొట్లాడలేదు. గులాబీ జెండా ఎగిరేవరకు కనీసం తెలంగాణ సోయిని కూడా ప్రదర్శించలేకపోయారు. స్వరాష్ట్రం కోసం అవసరమైన ప్రతి సందర్భంలోనూ పదవులు త్యాగం చేసినవారు భారాస బిడ్డలు మాత్రమేనని గర్వంగా చెబుతున్నా. కానీ, పదవుల కోసం తెలంగాణను ఆగం చేసినవారు ఆనాటి కాంగ్రెస్ నాయకులు. హైదరాబాద్ నడిబొడ్డున ఉండే మన శాసనసభలో ఒక దశలో తెలంగాణ పదాన్నే నిషేధించారు నాటి పాలకులు. తెలంగాణ అని అనవద్దంటూ స్పీకర్ ద్వారా రూలింగ్ ఇప్పించారు.

**అధికారాన్ని బాధ్యతగా తీసుకున్నాం**

ప్రత్యేక తెలంగాణలో ప్రజలు మనకు తొలి విడతలోనే పట్టం కట్టారు. అదేదో అధికారం అనుభవించేందుకు తీసుకోలేదు. బాధ్యతగా తీసుకున్నాం. రాష్ట్రాన్ని మన చేతుల్లో పెడితే ఎక్కడో ఉన్న తెలంగాణను ఎక్కడికో తీసుకెళ్లాం. పదేళ్ల భారాస పాలనలో తెలంగాణ ఏ స్థాయికి ఎదిగింది.. ఎన్ని రంగాల్లో ఎన్ని అవార్డులు వచ్చాయి.. ఎన్ని అద్భుతమైన పనులు చేసి చూపించాం.. అన్నీ గుర్తుచేసుకోవాలి. తెలంగాణ అంటే ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం.. ఎగతాళికి గురైన ప్రాంతం. కానీ.. రాష్ట్రం ఏర్పడ్డాక వాటన్నిటినీ పటాపంచలు చేశాం. అన్ని రంగాలను పరుగు పెట్టించాం. రూ.90 వేలున్న తలసరి ఆదాయాన్ని రూ.3.50 లక్షలకు పెంచుకున్నాం. జీఎస్‌డీపీని దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లాం. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకున్నాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టులను ఆగమేఘాలపై పూర్తి చేయించాం. పాలమూరు జిల్లాలోనే 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 3.5 లక్షల టన్నుల వడ్లు పండించే స్థాయికి రాష్ట్రంలో సాగునీటి సదుపాయాలను అభివృద్ధి చేశాం. పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి వరంగల్ గడ్డకు నీరు తెచ్చుకున్నాం. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకున్నాం. వాగులు, వంకలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల్లో పూడిక తొలగించాం. మొత్తంగా అద్భుతమైన తెలంగాణను తీర్చిదిద్దుకున్నాం.

**కిక్కిరిసిన ఎల్కతుర్తి సభా ప్రాంగణం**

**ప్రజలు అడగకముందే..**

రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కంటి వెలుగు వంటి కార్యక్రమాలు అమలు చేయాలని నన్నెవరూ అడగలేదు. మన రాష్ట్రం.. మన ప్రజలని.. వారిని బాగు చేసుకోవాలని ఆ పథకాలు అమలు చేశాం. చెరువుల్లో చేపలు పెంచాలని నన్ను ఎవరు అడిగారు? మత్స్యకారులకు పని దొరకాలని, వారిని ప్రోత్సహించాలని చెరువుల్లో చేపలు పెంచాం. లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని ఎవరూ అడగలేదు.. పెంపకందారులు బాగుండాలని ఆ పథకాన్ని అమలు చేశాం. పారిశ్రామికరంగంపై దృష్టి పెట్టాం. పెట్టుబడులను ఆకర్షించాం. సుమారు 20–25 లక్షల మంది యువతకు ఉద్యోగాలిప్పించే ప్రయత్నం చేశాం. రూ. 40 వేల కోట్లున్న ఐటీ ఎగుమతులను రూ.2.50 లక్షల కోట్లకు పెంచగలిగాం. ఐటీ రంగంలో ఏడు లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. వెయ్యికిపైగా గురుకులాలు తీసుకువచ్చి.. పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాం. మెడికల్ కాలేజీలను 3 నుంచి 33కి పెంచాం. భారాస హయాంలో మత కల్లోలం లేదు. కర్ఫ్యూ లేదు. శాంతిభద్రతల్ని చక్కగా కాపాడి.. అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకున్నాం. ఇవన్నీ నా డైలాగులు కాదు, స్టోరీలు కాదు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా అనేక సందర్భాల్లో చెప్పిన విషయాలు.. ఆర్‌బీఐ, కాగ్ వంటి సంస్థలు వెల్లడించిన అధికారిక లెక్కలేనని మీకు మనవి చేస్తున్నాం.

**సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చారు**

మన ప్రభుత్వంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు పెట్టి తడిసినా, రంగు పోయినా, మొలక వచ్చినా.. రైతులు, మన బిడ్డలు కాబట్టి ప్రభుత్వానికి రూ. 5 వేల కోట్ల నష్టం వచ్చినా కొన్నాం.. కాంగ్రెసోళ్లేమో ప్రజల్ని బోల్తా కొట్టించేందుకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన కల్యాణలక్ష్మిని కాదని.. దానికి తులం బంగారం కలిపి ఇస్తామన్నారు. ఇది ఎవరికైనా వచ్చిందా? ఇలా 420 హామీలపై పెద్ద పెద్ద పుస్తకాలు పంచారు. సిగ్గు లేకుండా బాండ్ పేపర్లు రాసిచ్చారు. ఇవన్నీ ఎలా ఇస్తారని అడిగితే.. చేసి చూపిస్తామన్నారు. మరి అవన్నీ ఇచ్చారా? అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని చేయలేదు. ఈలోపు ఎంపీ ఎన్నికలొచ్చాయి. నాకు కాలు విరిగినా, జనంలోకి బయలుదేరాను. దీంతో తెలంగాణలో ఎందరు దేవుళ్లుంటే అందరి మీదా ఒట్లు పెట్టారు. ఎన్నో మాటలు చెప్పి మోసం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి.. వాళ్లు జుట్లు పట్టుకుని కొట్టుకునే స్థాయికి తెచ్చారు. ఈ ఉచిత బస్సు మాకు అవసరం లేదని ఆడబిడ్డలు అంటున్నారు.

**జేసీబీలతో పేదల ఇళ్లు కూలగొట్టిస్తున్నారు**

మేం జేసీబీలు పెట్టి చెరువుల్లో పూడిక తీస్తే.. కాంగ్రెస్ పార్టీ హైడ్రా అంటూ పేదల ఇళ్లు కూలగొట్టిస్తోంది. కేసీఆర్ బాగా ఇచ్చిన కరెంటు.. కాంగ్రెస్ ఎందుకివ్వలేకపోతోంది? మంచినీళ్లు ఎందుకు బంద్ అయ్యాయి? భూముల ధరలు ఎందుకు పడిపోయాయి? ప్రభుత్వ ఆదాయం కోసం అత్యవసరమైతే ప్రజలకు ఉపయోగం లేని భూములు అమ్మవచ్చు. కానీ ఏది అమ్మాలో.. ఏది అమ్మకూడదో తెలివి ఉండాలి. కాంగ్రెసోళ్లు ఇప్పుడు హెచ్‌సీయూ భూములను అమ్ముతున్నారు. రేపు ఓయూలో విలువైన భూములున్నాయని వాటిని అమ్మేస్తారా?

**రాష్ట్రానికి ఏం బీమారీ వచ్చింది?**

కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు బోల్తా పడ్డారు. ప్రభుత్వంలో ఉన్న నాయకులు.. నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారు. భారాస, కేసీఆర్ మీద నిందలు వేస్తున్నారు. మంచిగా ఉన్న తెలంగాణను ఆగం చేశారు. ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని అబద్ధాలు చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మట్లేదని, అప్పులు పుట్టడంలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారీ వచ్చింది? కేసీఆర్ శాసనసభకు ఎందుకు రారని ప్రశ్నించేవారికి చెబుతున్నా.. అసెంబ్లీలో మా పార్టీ నాయకులు ప్రశ్నిస్తేనే ఈ ప్రభుత్వంలో సమాధానం చెప్పే దిక్కులేదు. అలాంటప్పుడు వాళ్లకు నేను కావాలా?

**కమీషన్లు అంటే భుజాలు తడుముకుంటున్నారు**

రాష్ట్రంలో కమీషన్ల పాలన నడుస్తోంది. 25– 30% కమీషన్లు అడుగుతున్నారని కాంట్రాక్టర్లే సచివాలయానికి వచ్చి మొరపెట్టుకున్నారు. వీటి గురించి అసెంబ్లీలో కేటీఆర్ ప్రస్తావిస్తే.. ఆర్థికమంత్రి లేచి అభ్యంతరం చెప్పారు. కమీషన్లు లేకపోతే ఆయన ఎందుకు భుజాలు తడుముకున్నట్లు? కమీషన్లు తీసుకోవడం సంచులు మోయడమే కాంగ్రెస్ పార్టీ పని.

**తెలంగాణపై భాజపా కక్ష**

తెలంగాణపై భాజపా కక్ష కట్టింది. తల్లిని చంపి బిడ్డను తీశారంటూ ప్రధాని నరేంద్రమోదీ పదేపదే అంటున్నారు. కేంద్రంలోని భాజపా.. తెలంగాణ ఆవిర్భావంలోనే ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపింది. సీలేరును కూడా అప్పగించింది. దేశవ్యాప్తంగా కొత్త వైద్యకళాశాలలు ఇచ్చి, తెలంగాణకు మొండిచేయి చూపింది.

**మా వాళ్లపై కేసులెందుకు పెడుతున్నారు?**

పోలీసులూ.. మీ డైరీల్లో రాసిపెట్టుకోండి. మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే. కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు వివరిస్తున్న భారాస సోషల్ మీడియా వారియర్స్‌పై కేసులు ఎందుకు పెడుతున్నారు? పోలీసులూ మీ విధులు మీరు నిర్వర్తించండి. రాజకీయాలు వద్దు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కేసులు ఎదుర్కొనే కార్యకర్తలకు భారాస లీగల్ సెల్ అండగా ఉంటుంది.

# తెలంగాణ నూతన సీఎస్ గా కె.రామకృష్ణారావు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైన సీఎస్ పదవికి రామకృష్ణారావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. ఆమె పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం ముందుగానే కొత్త సీఎస్ నియామక ప్రక్రియను పూర్తి చేసింది. శాంతి కుమారి స్థానంలో కె.రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుదీర్ఘ పాలనా అనుభవం కలిగిన ఆయన, గతంలో పలు ముఖ్యమైన శాఖల్లో పనిచేశారు. ఆర్థిక శాఖలో ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు అత్యున్నత పరిపాలనా పదవి అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది. త్వరలోనే ఆయన నూతన పదవిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ భార్య

- మొదటి పేజి తరువాయి

మగ శిశువుకు జన్మనిచ్చారు. ఉన్నత స్థానంలో ఉన్న అధికారి అయి ఉండి కూడా, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్యాన్నే ఆశ్రయించడం విశేషం.వివరాల్లోకి వెళితే, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయ గర్భం దాల్చిన నాటి నుంచి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. తాజాగా ఆమెకు ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యులు విజయకు సాధారణ ప్రసవం ద్వారా కాన్పు చేశారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.జిల్లా ప్రథమ పౌరుడిగా భావించే కలెక్టర్, తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు అందించడం ద్వారా, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందుతుందనే సందేశాన్ని ప్రజలకు బలంగా పంపినట్లయింది. సామాన్యులకు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై మరింత భరోసా కల్పించేలా కలెక్టర్ శ్రీహర్ష తీసుకున్న ఈ నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

# ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల్లో.. 53% మంది అనర్హులే..

- మొదటి పేజి తరువాయి

దీని ప్రకారమే ప్రతి ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 చొప్పున.. రాష్ట్రంలో ఏటా గరిష్ఠంగా మొత్తం 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఇళ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల మేరకు అన్ని కోణాల్లో చేసిన సర్వేతో పాటు.. ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా దరఖాస్తుదారులను ఎల్–1, ఎల్–2, ఎల్–3గా విభజించారు. ఎల్–1లో 23.05 లక్షలు, ఎల్–2లో 21.44 లక్షలు, ఎల్–3లో 32.69 లక్షల దరఖాస్తుదారులు ఉన్నట్లు తేల్చారు. ఎల్–1 జాబితాలో సొంత స్థలాలు ఉండి ఇళ్లు లేని వారిని చేర్చారు. సొంత స్థలంలో పూరిళ్లు, మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని కూడా ఇందులో చేర్చారు. ఎల్–2 జాబితాలో స్థలాలు, ఇళ్లు లేని వారిని చేర్చారు. ఎల్–3 జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, సొంత ఇళ్లు, కార్లున్నవారు, దారిద్ర్యరేఖ(బీపీఎల్)కు ఎగువన ఉన్నవారు, ఆదాయపుపన్ను చెల్లిస్తున్న వారిని చేర్చారు. వీటి ఆధారంగా గత ఫిబ్రవరిలోనే జాబితాను తయారు చేశారు. పలు ఫిర్యాదులు రావడంతో మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా అనర్హుల జాబితాను ప్రభుత్వం రూపొందించింది. గ్రామాలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పురపాలికల వారీగా ఈ జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసి ఉంచింది. దాని ప్రకారం.. ఎల్–3లో 32.69 లక్షల మంది ఉన్నట్లు గృహనిర్మాణశాఖ గుర్తించింది. తాజాగా మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంతో అనర్హుల సంఖ్య 41.15 లక్షలకు పెరిగింది. నిబంధనల ప్రకారం ఎల్–3 జాబితాలో చేర్చిన వారంతా అనర్హులే. ఎల్–1 జాబితాలో 18.67 లక్షల మంది, ఎల్–2 జాబితాలో 17.36 లక్షల మంది అర్హులుగా తేలారు.

# అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

- మొదటి పేజి తరువాయి

భారాస అధినేతపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాగాంధీ ఇవ్వకపోతే తెలంగాణ వచ్చేదా? అని వారు నిలదీశారు. తెలంగాణ సంపదను కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల పేరుతో కొల్లగొట్టారని ఆరోపించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

**మీ కుటుంబ సభ్యులకు రూ.వేల కోట్ల ఆస్తులెలా వచ్చాయి?: పొంగులేటి**

'కడుపులో అంత విషం పెట్టుకుని, ఉక్రోషంతో మీ పార్టీ సభలో మాట్లాడారు. భారాస పదేళ్ల పాలనలో చేసిన ఘనకార్యాలు, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అసెంబ్లీలో చర్చిద్దామా? ప్రతి అంశంపై మాట్లాడుదాం. ఆరు రోజులైనా, ఎనిమిది రోజులైనా చర్చిద్దాం. తేదీ ఎప్పుడో కేసీఆర్ చెప్పాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాలు విసిరారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. కేంద్రం నివేదిక ఇచ్చింది. కాళేశ్వరం అవినీతిపై సభలో ఎందుకు మాట్లాడలేదు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? నాడు సోనియాగాంధీని దేవత అని పొగిడారు. మీ కుటుంబం అంతా సోనియాకు సాష్టాంగ నమస్కారం చేసిన విషయాన్ని మరిచిపోయారా? ప్రజలు రెండుసార్లు అధికారం ఇస్తే తెలంగాణ సంపదను కొల్లగొట్టారు. అందుకే ప్రజలు మీ పార్టీకి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో గుణపాఠం చెప్పారు. మీరు ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో ప్రభుత్వానికి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. ఐదారు పర్యాయాలు అసెంబ్లీ సమావేశాలు జరిగితే మీరు ప్రేక్షకుడి మాదిరి రెండురోజులే వచ్చి వెళ్లారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో.. ఇందిరమ్మ ప్రభుత్వంలో మంత్రులంతా సామాన్యులకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతుంటే తట్టుకోలేకపోతున్నారు. మీరు సీఎంగా ఉన్నప్పుడే కాంట్రాక్టర్లకు రూ.80–82 వేల కోట్ల బకాయిలున్నాయి. సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా మోసం చేసిందే భారాస ప్రభుత్వం. ఉద్యమ పార్టీ నుంచి మొదలై భారాసగా మారిన మీ పార్టీకి రూ.1500 కోట్లకుపైగా డబ్బు ఎలా వచ్చింది? ఏం వ్యాపారం చేశారని మీ కుటుంబ సభ్యులకు రూ.వేల కోట్ల ఆస్తులు వచ్చాయి? అధికారంపై మీవి పగటి కలలే. ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ ఖమ్మం సభకు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్సులే కాదు.. ఆటోలు, ద్విచక్రవాహనాలను రాకుండా చేశారు. భారాస సభకు మీరు ఎన్ని బస్సులు అడిగితే అన్నింటికి రేవంత్ ప్రభుత్వం అనుమతించింది. ప్రజాస్వామ్యం అంటే ఇది. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తా అన్నారు. చేయలేదు. మీరు ఎలాగు అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవి దళితుడికి ఇవ్వొచ్చు కదా? కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయాలని మీరెంత తాపత్రయపడ్డా ఫలితం ఉండదు. మీ పగటి కలల్ని తెలంగాణ ప్రజలు నెరవేరనీయరు." అని పొంగులేటి అన్నారు.

**పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకున్నారు: సీతక్క**

"అధికారం పోయిందన్న అక్కసును కేసీఆర్ వెళ్లగక్కారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలల్లో 59వేల ఉద్యోగాలు ఇస్తే.. భారాస అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల్ని వాడుకుని అణచివేస్తే ఆత్మహత్యలు చేసుకున్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై కచ్చితంగా కేసులు పెడతాం. అధికారంలో ఉన్నప్పుడు ఇంటింటికి తాగునీటి పేరిట రూ.వేల కోట్లు తినేశారు.. కానీ నీళ్లు ఇవ్వలేదు. భారాస హయాంలో 5వేల మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అంత దారుణంగా పోలీసు వ్యవస్థను ఎవరూ వాడుకోలేదు. అధికారం ఉంటే.. అసెంబ్లీకి వస్తారు లేకుంటే రాని మీరు నాయకులు కానేకారు. నియంతలు అధికారం పోయాక ప్రజల్లోకి వచ్చి మొసలికన్నీరు కారుస్తారు.. కేసీఆర్ ఇందుకు నిదర్శనం.ↄ

# ఉగ్రదాడి దోషులను వదిలిపెట్టం

- మొదటి పేజి తరువాయి

జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడినీ కలచివేసిందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈరోజు మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ, నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి ప్రతి పౌరుడి హృదయాన్ని గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఏ భాష మాట్లాడే వారైనా, ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు" అని మోదీ తెలిపారు. ఉగ్రవాద దాడి చిత్రాలను చూసిన తర్వాత ప్రతి భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడని తాను అర్థం చేసుకోగలనని ప్రధాని అన్నారు. "ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నిరాశకు, పిరికితనానికి పహల్గామ్ దాడి అద్దం పడుతోంది" అని ఆయన పేర్కొన్నారు.

కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొంటున్న తరుణంలో, పాఠశాలలు, కళాశాలలు తిరిగి కళకళలాడుతున్న వేళ, అభివృద్ధి పనులు ఊపందుకున్న సమయంలో, ప్రజాస్వామ్యం బలపడుతున్నప్పుడు, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పుడు, యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నప్పుడు.. దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చలేదని ప్రధాని విమర్శించారు. "కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు, వారి యజమానులు ఇంత పెద్ద కుట్ర పన్నారు" అని మోదీ ఆరోపించారు. ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద బలమని ప్రధాని నొక్కిచెప్పారు. "ఈ ఐక్యతే ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఆధారం. ఈ సవాలును ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. ఒక దేశంగా మనం బలమైన సంకల్ప శక్తిని ప్రదర్శించాలి. ఈ ఉగ్రదాడి తర్వాత యావత్ దేశం ఒకే గొంతుకతో మాట్లాడుతున్న విషయాన్ని నేడు ప్రపంచం గమనిస్తోంది" అని ఆయన అన్నారు. ఈ దాడి ఘటనపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సంతాప సందేశాలను ప్రధాని ప్రస్తావించారు. "భారతీయులమైన మనం అనుభవిస్తున్న ఆగ్రహాన్నే యావత్ ప్రపంచం కూడా అనుభవిస్తోంది. ఉగ్రదాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ నాయకుల నుంచి నాకు ఫోన్ కాల్స్, సందేశాలు అందాయి. వారంతా ఈ ఘోరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులతో యావత్ ప్రపంచం నిలుస్తోంది" అని మోదీ వివరించారు."బాధిత కుటుంబాలకు నేను మరోసారి హామీ ఇస్తున్నాను, మీకు న్యాయం జరుగుతుంది. కచ్చితంగా న్యాయం జరుగుతుంది. ఈ దాడికి పాల్పడిన వారు, కుట్రదారులు అత్యంత కఠినమైన ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

# యుద్ధానికి మేం రెడీ..

- మొదటి పేజి తరువాయి

స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కలిశారు. ప్రస్తుత కాశ్మీర్ పరిస్థితిపై, యుద్ధం వస్తే తాము సిద్ధంగా ఉన్నామని రక్షణమంత్రికి తెలిపినట్లు తెలుస్తోంది. మరోవైపు పహల్గామ్‌లో దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి భారత సైన్యం జమ్మూకాశ్మీర్ మొత్తం జల్లెడ పడుతోంది. పలువురు ఉగ్రమూకల ఇళ్లను నేలమట్టం చేసింది. ఉగ్రవాదులను అంతమొందించేవరకు ఆపరేషన్ కొనసాగుతుందని ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత అటు అరేబియా సముద్రంలో కూడా భారత యుద్ధనౌకలు మోహరించాయి. పలు మిస్సైల్స్ టెస్ట్ చేసి యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించాయి.ఇప్పటికే సింధుజలాలను రద్దు చేసి పాక్ ను ఇరకాటంలో పెట్టిన భారత్..తాజా పరిమాణాలతో పాకిస్తాన్ గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. భారత్ చర్యలకు భయపడిన పాక్..తాను కూడా సైనిక విన్యాసాలు మొదలుపెట్టింది. మరోవైపు పాక్ నేతలు తమ వక్రబుద్ధిని చూపిస్తున్నారు. సింధు జలాలను నిలిపివేస్తే..భారత్ పై అణుబాంబులు ప్రయోగిస్తామని పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు. తమ దగ్గర 130 అణుబాంబులు ఉన్నాయి..అవి భారత్ పై వేస్తామంటూ పాక్ నేత బిలావల్ భుట్టో నోటి దురుసును ప్రదర్శించారు. భుట్టో వ్యాఖ్యలకు అసోం సీఎం హేమంత బిస్వశర్మ తీవ్రంగా స్పందించారు. పాక్ పై భారత్ ప్రతీకారం తీర్చుకోకుండా ఎవరూ అడ్డుకోలేరని వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఉగ్రవాదులను , వారికి సాయం చేస్తున్న వారికి వెతికి పట్టీ మరీ శిక్షిస్తుందని అన్నారు.

# సేవా భావమే.. డాక్టరేట్ కి బాటలు వేశాయి...

- సేవలు ఫలించి.. డాక్టరేట్ వరించి.
- సేవల ఫలితం.. డాక్టరేట్ అందలం..
- అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి తిరుణ హరిబాబు తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలకు అరుదైన గౌరవం.
- ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి (ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ) చెన్నై ఆధ్వర్యంలో డాక్టరేట్ పురస్కారం అందజేత.
- తెలుగు రాష్ట్రాల్లో హరిబాబు కి పలువురి ప్రశంసల వర్షం.
- ఈ స్ఫూర్తి తో సేవలు మరింత విస్తృతం చేస్తానని, తన పై బాధ్యత పెరిగిందని హరిబాబు వెల్లడి.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,** ఓ సాధారణ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు పూర్తి చేసుకుని ఇంతింతై వటుడింతై అన్న చందంగా తాను సంపాదించిన దానిలో సమాజ సేవకు ఉపయోగిస్తూ, తనకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు ఉచితంగా అందిస్తూ అరుదైన గౌరవం డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు.... పాల్వంచ పట్టణంలో అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి తిరుణ హరిబాబు తెలుగు రాష్ట్రాల్లో విద్య, సామాజిక రంగాల్లో అందించిన సేవలకు తమిళనాడు రాష్ట్రం కు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి( ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ ) ఆధ్వర్యంలో శనివారం డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. ఇందులో భాగంగా సంస్థ ప్రతినిధులు డాక్టర్ అరుణ్ చిన్న దురయ్, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ కృష్ణ మూర్తి, డాక్టర్ నరసింహ మూర్తి, డాక్టర్ రవి కుమార్ ల చేతులు మీదుగా డాక్టరేట్ గౌరవం అందుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ బాల్యం నుంచి ఎదుర్కొన్న ఒడిదుడుకులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న తనం నుంచి పడ్డ కష్టాలు అతన్ని ఉంటది గౌరవ పురస్కారాన్ని అర్హుడిగా మార్చాయి అన్నారు. అనుకున్నది సాధించడం చదువుకునే వయసు నుంచి అలవాటని, అందుకే విద్యా సంస్థలు స్థాపించి పేద విద్యార్థులకు ఉచితంగా అందుబాటుకి విద్యను తీసుకొచ్చా అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో చదువుకునే విద్యార్థుల కు ఆర్థికంగా సహకరిస్తున్నామన్నారు. ఎంబీబీఎస్, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫీజు కడుతున్నట్టు గుర్తు చేశారు. గణితంలో స్వయంగా ఇంటర్మీడియెట్ పుస్తకం రచించినట్టు హరిబాబు తెలిపారు. వీటితో పాటు వృద్ధులకు తన వంతుగా దుస్తులు, అన్నదానం ఇతరత్రా సహాయం అందిస్తున్నామన్నారు. గత నాలుగేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలో విద్యా, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్నమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. హరిబాబు డాక్టరేట్ అందుకోవడం పట్ల తెలుగు రాష్ట్రాల్లో పలువురు ప్రముఖులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# ఈ బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ కు రివార్డు...

- డీజీపీ చేతులు మీదుగా రివార్డు అందుకున్న ఎస్ఐ రాజకుమార్...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**పినపాక మండలం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజకుమార్ కు మాదకద్రవ్యాలు నిర్మూలన లో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా రివార్డు అందుకున్న ఎస్ఐ రాజ్ కుమార్.

ఈ సందర్భంగా ఎస్ఐ రాజకుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా నాకు అవార్డు రావడం అవార్డుని తెలంగాణ రాష్ట్ర డిజిపి చేతుల మీద నుంచి అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

అలాగే యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా భవిష్యత్తు కు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా ఎస్ఐ రాజకుమార్ యువతకు సందేశం ఇచ్చారు.

ఎస్ఐ రాజ్ కుమార్ కి మాదకద్రవ్యాల నిర్మూలన రివార్డు అందుకున్నందుకు పలువురు ఉన్నత అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

# మేడే ఉత్సవాలును జయప్రదం చేయండి :-CITU.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్27.** ప్రపంచ కార్మిక దినోత్సవం, కార్మికుల యొక్క పండుగ మే ఒకటవ తేదీ మే డే ను ఘనంగా జరుపుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు కార్మికులకు పిలుపునిచ్చారు.

శనివారం రోజున వలిగొండ వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో సిఐటియు వలిగొండ మండల జనరల్ బాడీ సమావేశం కొండ నరసింహ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాండు మాట్లాడుతూ

కార్మికులు కర్షకులు రోజుకు 12 గంటల పని విధానం వద్దని తన ప్రాణాలు బలి ఇచ్చి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్న రోజు మే డే రోజు అని అన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని వక్రీకరిస్తూకార్మికుల చేత మెట్టి చేయిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్ట సవరణలు తీసుకువచ్చి సంఘం పెట్టుకునే హక్కు లేకుండా, కార్మికులకు పనికి తగ్గ వేతనం అడిగే దానికి వీలు లేకుండా నాలుగు లేబర్ కోళ్లు తీసుకువచ్చి కార్మికుల గొంతు నొక్కి పడుతున్నాయని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న పని గంటల విధానాన్ని రద్దు చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల ను, తీసుకోవచ్చా చట్ట సవరణలు రద్దు చేసేంతవరకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలను గ్రామ గ్రామాన పట్టణ కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాధారపు మల్లేశం హమాలీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని జంగయ్య, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవల్లి ఎల్లమయ్య, మండల కార్యదర్శి రాములు వ్యవసాయం మార్కెట్ హమాలి కార్మిక సంఘం నాయకులునరసింహ, వ లయ్య, సిఐటియు మండల నాయకులు రాములు, సత్తయ్య, అంజయ్య, జనార్ధ న్, మల్లేశం, వెంకటేశం, ఎల్లయ్య, వీరస్వామి, రాములు, రేణుక, కృష్ణవేణి, లక్ష్మమ్మతదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి.....!

- సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు.
- సిఐటియు ఆధ్వర్యంలో కాశ్మీర్ మృతులకు ఘన నివాళి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఏప్రిల్ 27,**పర్యటకుల పై అత్యంత దుర్మార్గంగా కాల్పులు జరిపి మారణహోమం సృష్టించిన ఉగ్రవాదుల ను కఠినంగా శిక్షించాలని సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు సీనియర్ నాయకులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కార్మిక కూడలి ల వద్ద కాశ్మీర్ మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుండి కాశ్మీర్ అందాలను చూసేందుకు పర్యటకులు వేల సంఖ్యలో వస్తుంటారని అటువంటి సున్నితమైన ప్రదేశాలలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం భద్రతను తగ్గించిందని వారు ఆరోపించారు. పాకిస్తాన్ నుండి తీవ్రవాదులు భారతులకు ప్రవేశించి సుమారు 15 నిమిషాల పాటు కాల్పులు జరిపిన సైనికులు గాని పోలీసులు గాని అక్కడికి చేరుకోలేదు అంటే భద్రత వైఫల్యం ఏ స్థాయిలో ఉందో కొట్టొచ్చినట్టు కనబడుతుందని అన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రదేశాలలో నిగాను భద్రతను పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో కాశ్మీర్లో ఎన్నో వేలమంది ఉపాధి కోల్పోతున్నారని ఉగ్రవాదం ఏ మతంలో ఉన్న దానిని ఎంతమందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సందర్భంగా శరత్ బాబు స్వామిలు స్పష్టం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు సానుభూతిని తెలుపుతూ మృతులకు నివాళులు అర్పించే కార్యక్రమాలు చేపట్టామని అంతేకాకుండా దేశంలో శాంతి నెలకు నేందుకు సిఐటియు అన్ని విధాల కృషి చేస్తుందని అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణ వ్యాప్తంగా అన్ని కార్మిక వాడల వద్ద శాంతి సామరస్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేయగా ఈ కార్యక్రమం లో సిఐటియు కోర్ కమిటీ సభ్యులు పారేలి సంతోష్ కుమార్ చాట శ్రీనివాసరావు చెన్నుపాటి ముఠా సంఘం నాయకులు శ్రీను నరసింహ రావు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారు.

**బీఆర్ఎస్ రజకోత్సవ సభకు బయలుదేరిన సీతక్క.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆదివారం వరంగల్ సభకు పార్టీ కార్యకర్తల తో సాదాసీదాగా ఆర్టీసీ బస్సులో కలిసి బయలుదేరారు. ఈ సందర్భంగా రామవరం కేంద్రంలో, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయంలో పార్టీ జెండాను టీబీజీకేఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాపుకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏడాదిన్నర రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని, కేసీఆర్ పాలన వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు. నేటి వరంగల్ సభతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ జీరో అవుతుందని విమర్శించారు. 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అసత్యపు హామీలను ప్రజలు నమ్మి ఓట్లేసారని, నేడు ఈ విషయాన్ని గ్రహించారని తెలిపారు. ఇక ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ ను గెలిపించడానికి ప్రజలు ఉన్నారని అన్నారు. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, జిల్లాకో కలెక్టరేట్, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి.



రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,** ప్రాచీన కళలను ప్రోత్సహించే విధంగా కళాకారుల సంక్షేమానికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నదని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పాలకొయ్య తండా లో ఉప్పలపూడి రాము (డప్పు రాము) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుశీల విజయకుమార్ నాట్యాలయంను ఆదివారం ఉదయం కొత్వాల ప్రారంభించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో కళారంగం క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటుందని, కళలకు చేయూతనివ్వడం సామజిక బాధ్యత అని అన్నారు. జానపద కళాకారులు సంప్రదాయంగా నృత్యాల్లో శిక్షితులవుతున్నారని కొత్వాల అన్నారు. ఈ సందర్భంగా కొత్వాల డప్పు రాముని అభినందించారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉప్పలపూడి రాము (డప్పు రాము), మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కళాకారులు పాకలపాటి రోశయ్య చౌదరి, గద్దర్ బాషా, షరీఫ్ బాబా, ఖాసీం, వీర మోహన్, పాతూరి రామ మోహన్ రెడ్డి, గోవర్ధన్, నవీన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, పులి సత్యనారాయణ, పుప్పాల వెంకటేశ్వర్లు (బాబు), సీపీఎం నాయకులు తులసీరామ్, లక్ష్మి, సిపిఐ నాయకురాలు నాగమణి, రాంబాబు, ఉపేందర్, విజయ్, అరుణ, రంగమ్మ, మంగమ్మ, స్వరూపలి, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి గిరిజన హస్తకళల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ జితేష్. వి.పాటిల్, ప్రత్యేక కార్యాచరణ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుష్మిత కనేరి జిల్లా పర్యటనలో నాయకపోడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ యూనిట్ పరిశీలన, అభివృద్ధి మార్గదర్శకం పై చర్చ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్, ఆదేశాల మేరకు, జిల్లాలో గిరిజన సంప్రదాయ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టబడుతోంది.

ఈ కార్యక్రమంలో భాగంగా, గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుష్మిత కనేరి ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన చేపట్టారు. ఆమె ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్. వి.పాటిల్ ను కలుసుకుని, గిరిజన హస్తకళల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల పై మార్గదర్శక ఆదేశాలు తీసుకున్నారు.

తదనంతరం, ములకలపల్లి మండలంలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకపోడ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కడి గిరిజన కళాకారులు రూపొందిస్తున్న సంప్రదాయ హస్త కళాకృతుల తయారీని, నైపుణ్యాలను ప్రత్యక్షంగా సమీక్షించారు.

యూనిట్ పరిశీలన అనంతరం, సుష్మిత కనేరి కలెక్టర్ జితేష్.వి.పాటిల్ తో గిరిజన కళాకారుల నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ లింకేజ్, ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రాచుర్యం కోసం తీసుకోవలసిన చర్యలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంపదను ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయడానికి కలెక్టర్ ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంకయ్య ఏపీఎం ( ఫామ్), డి ఆర్ డి ఓ కార్యాలయం, హరి కృష్ణ, జే డి ఎం, ఐ టి డి ఏ, అంజన్, నాయకపోడు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మాదారం. పాల్గొన్నారు.

# ఉగ్రదాడి మృతులకు పౌరసమాజం ఆధ్వర్యంలో నివాళులు.

- పాల్గొన్న టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**పహల్గాం పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులను నిరసిస్తు కొత్తగూడెం పౌరసమాజం ఆధ్వర్యంలో శనివారం సూర్యోదయ స్కూలు నుండి పోష్టాపీసు సెంటర్ వరకు జరిపిన భారీ ర్యాలీలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత హేయమని అన్నారు. నాడు బ్రిటిష్ దొరలను దేశంనుంచి వెళ్లగొట్టేందుకు కులమతాలకతీతంగా పోరాటం చేశామని, నేడు ఉగ్రవాదులను తరిమేందుకు పోరాడదామని, దేశ సమైక్యతకు పాటుపడదామని పిలిపునిచ్చారు. ఉగ్రవాదానికి మతం రంగు పులిమి దేశాన్ని విచ్చిన్నం చేయాలనే వారి ఆకాంక్షను నెరవేరనివ్వబోమని స్పష్టం చేశారు.

# గంజాయి రవాణా నివారణకు ప్రజలు సహకరించాలి-గబ్బాడ గ్రామంలో పోలీసుల అవగాహన కార్యక్రమం

**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 27 :** గంజాయి రవాణా నిరోధానికి ప్రజలు సహకరించాలని నర్సీపట్నం రూరల్ సర్కిల్ పోలీసులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ , ఎస్సై పి రాజారావు, రాత్రి మండలంలోని గబ్బాడ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఎల్ రేవతమ్మ మాట్లాడుతూ, యువత డబ్బుల కోసం ఆశపడి గంజాయి రవాణాకు సహకరిస్తే చట్ట పరంగా ఎటువంటి కఠిన శిక్షలు ఉంటాయో వివరించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్ వల్ల ప్రజలు ఎలా నష్టపోతున్నారనే అంశాలపై సోదాహరణంగా వివరించారు. అదే విధంగా నేరాలు అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర, సీసీ కెమెరాలు గ్రామానికి ఇరువైపులా పెట్టడం వల్ల కలిగే ఉపయోగాలపై సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**బూర్గంపాడు మండలం, సారపాక శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు . ఉదయం నుండి స్వామివారికి అభిషేకము, వస్త్రాలంకరణ, అష్టోత్రము , ఆకుపూజ హనుమాన్ చాలీసా వంటి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఎంతో శక్తివంతుడని, కోరిని కోర్కెలు తీర్చే ఇష్టదైవమని ఆయనకు తమలపాకు దండ, సింధూరం సమర్పించిన ఎలాంటి కష్టాలు దరిచేరవుఅని భక్తుల విశ్వాసం. అలాంటి స్వామి సేవలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు . ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తుందని ,ఈ ఆలయ కేంద్రం ద్వారా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు, గత రెండు నెలల నుండి ఆలయ పునర్నిర్మాణం జరుగుతున్నది ఆలయ పునర్నిర్మాణం కోసం సుమారుగా కోటి 50 లక్షలు రూపాయలు అవుతుందని ఎస్టిమేషన్ చేశారు కావున భక్తులందరూ ఆలయ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు ధన రూపంలో కానీ,వస్తు రూపంలో కానీ అందించి ఆలయపున నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు ,మహిళా భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# నూతన సీఐ, ఎస్ఐ లను మర్యాదపూర్వకంగా కలిసిన భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఏప్రిల్ 27,**
భద్రాచల పట్టణ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండేపల్లి నాగరాజుని మరియు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గంజి స్వప్నని భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, భద్రాచల హెూటల్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి బత్తుల కృష్ణారెడ్డి, భద్రాచల లాడ్జి అసోసియేషన్ మెంబర్ ధనకొండ ప్రసన్న ఓబీసీ సెల్ నాయకులు రాగం సుధాకర్, ఐ.ఎన్.టి.యు.సి నాయకులు మాగపూ రాజు,ఆర్జి సోషల్ మీడియా అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ రజితోత్సవ సభకు బయలుదేరిన లింగరాజు పల్లి బి ఆర్ ఎస్ నాయకులు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 27.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని లింగరాజుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఈరోజు వరంగల్ లో జరగబోయే 25వ పార్టీ ఆవిర్భావ రజితోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు టిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షులు బొడిగ లింగస్వామి సమక్షంలో భారీ ఎత్తున తరలి వెళ్ళినారు.

## ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి.

- కర్రెగుట్ట నుండి కేంద్ర సైనిక బలగాలు వెనక్కి రావాలి.
- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నల్ల బ్యాడ్జీలతో నిరసన.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**ఆదివాసి, మావోయిస్టుల పై సైనికుల దాడులు ఆపాలి, ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి,కర్రెగుట్ట ను చుట్టుముట్టిన సైనిక బలగాలు వెనక్కి రావాలి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పాల్వంచలోని వనమా కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత నాలుగైదు రోజులు గా కర్రెగుట్టను సైనిక బలగాలు చుట్టుముట్టి జల్లెడ పడుతున్నారని అడ్డొచ్చిన ఆదివాసీలను చంపేస్తూ మావోయిస్టు ఎన్కౌంటర్లు చేస్తున్నారని శాంతి చర్చలకు వస్తామని ప్రకటించినప్పటికీ పిలవకుండా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆయన రాష్ట్ర ప్రభుత్వం కర్రెగుట్ట పై జోక్యం చేసుకొని కేంద్ర బలగాలను వెనక్కి పంపించే ప్రయత్నం చేయాలని ఆపరేషన్ నిలిపివేయాలని కేంద్రం తన అహంకారం వీడి మావోయిస్టుతో చర్చలు జరపాలని వారన్నారు కర్రెగుట్ట ఘటన ప్రజలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు బుద్ధి జీవులు ఖండించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు శ్రీనివాస్, నరసింహారావు, నాగేష్, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సహాయం చేసిన జి.కె ఫౌండేషన్



**సి కే న్యూస్ విశాఖ పట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 27 :** జనసేనాని పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తి ఫౌండేషన్ స్థాపక విలువలతో .34వ వార్డు దక్షిణ నియోజకవర్గం లో నివసిస్తున్న కడితి మంగంధ వర్ధన్ అను 10 సంవత్సరాల బాలుడు క్యాన్సర్ వ్యాధితో పోరాడుతుండడంతో, వైద్య ఖర్చుల నిమిత్తం 2025 ఏప్రిల్ 15వ నెల వెయ్యి రూపాయల చెక్కు ను అందజేయడం జరిగింది. ఈ చెక్కు తో(15వేలు )వారి కుటుంబానికి జి. కె ఫౌండేషన్ చైర్మన్ మరియు సభ్యులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 33వ వార్డు అధ్యక్షులు ఆకుల రాజు, 34వ వార్డు అధ్యక్షులు నీలం రాజు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా హ్యాట్రిక్, తలారి లింగం



**ఏప్రిల్ 27 ( సీ కే న్యూస్) చేగుంట :** చేగుంట మండల పట్టణ కేంద్రంలో ముదిరాజ్ యువజన సంఘం యొక్క నూతన ఎన్నికలు నిర్వహించారు, ఓటింగ్ ద్వారానే ముచ్చటగా మూడోసారి ముదిరాజ్ అధ్యక్షుడు తలారి లింగం గెలుపొందాడు అధ్యక్షుడు తలార్ లింగం మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి నన్ను మూడోసారిగా అధ్యక్షుడిగా గెలిపించినందుకు మీకు కష్ట సుఖాల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటానని, సంఘం ను డెవలప్మెంట్లో ముందుకు తీసుకెళ్తానని అన్నారు, అనంతరం సంఘం యొక్క నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ముదిరాజ్ అధ్యక్షుడు తలారి లింగం, ఉపాధ్యక్షుడు దుంపల రాజు, ప్రధాన కార్యదర్శి చింతాల సిద్ధిరాములు, కోశాధికారి తిరుపతి ప్రశాంత్, సహాయ కార్యదర్శి గండి గారి వెంకటేష్, సంఘం యొక్క నాయకులు పాల్గొన్నారు,

# లారీలో పట్టుబడిన 30 కేజీల గంజాయి..

**లారీ తో పాటు.. ముగ్గురు వ్యక్తుల అరెస్ట్..**

**పట్టుకున్న గంజాయి విలువ 15 లక్షలు లారీ విలువ 20 లక్షలు.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఏప్రిల్ 27,**భద్రాచలం ఐటిసి కంపెనీ పార్కింగ్ యాడ్ లో లారీలోంచి 30 కేజీల గంజాయిని హైదరాబాద్ కు చెందిన ఎస్ టి ఎఫ్ బి టీం ఎక్సైజ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు.

ఐటిసి పేపర్ మిల్లు కోసం అవసరమైన మూడు సరుకు కర్రను తీసుకు వస్తున్న లారీ డ్రైవర్ శివ ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకొస్తున్న అర్జున్ ఎక్కించుకొని భద్రాచలం తీసుకువచ్చాడు.

ఈ సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎస్టిఎఫ్ బి టీం ఎస్సై నాగరాజు మిగతా సభ్యులు కలిసి ఐ టి సి పార్కింగ్ యార్డులో నిలిచి ఉన్న లారీని తనిఖీలు చేయగా అందులో 30 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

డ్రైవర్ శివ తో పాటు గంజ్ ఒరిస్సా కు చెందినటువంటి అర్జున్ గంజాయి వ్యాపారి కలిసి పలుమార్లు ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకువచ్చి భద్రాచలంలో అమ్మకాలు చేపట్టినట్లు విచారణలో నిందితులు వెల్లడించారు.

ఎప్పటి లాగానే ఈసారి కూడా తీసుకువచ్చి నటువంటి గంజాయిని ఎస్టిఎఫ్ పోలీసులు పట్టుకోవడంతో గంజాయి అక్రమ రవాణా దారుల గుట్టురట్టు అయింది. పట్టుకున్న గంజాయి విలువ రూ. 15 లక్షలు, సీజ్ చేసినటువంటి లారీ విలువ 20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

డ్రైవర్ శివ గంజాయిని తీసుకొచ్చిన అర్జున్ మరో వ్యక్తి ప్రహ్లాదును గంజాయిని, లారీని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. గంజాయి పట్టుకున్నటువంటి ఎస్టిఎఫ్ బీ టీం ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్ రెడ్డి, బీ టీం ఇంచార్జ్ ప్రదీప్ రావులు అభినందించారు.

# పార్టీయే ప్రాణంగా జీవించిన మడెం లక్ష్మి.

**నిజాయితీ, నిబద్ధత గల ప్రజా ప్రతినిధి.**

**సిపిఎం మాజీ వార్డ్ మెంబర్ మడెం లక్ష్మి సంతాప సభలో వక్తలు.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**పార్టీ పట్ల అచంచలమైన విశ్వాసంతో పార్టీయే ప్రాణంగా పనిచేసిన ధన్యజీవి కామ్రేడ్ మడెం లక్ష్మి అని, గ్రామపంచాయతీ పాలకమండలిలో నిజాయితీ, నిబద్ధత గల వార్డు మెంబర్ గా ప్రజా ప్రతినిధి బాధ్యతలు నిర్వర్తించిన కామ్రేడ్ మడెం లక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబులు అన్నారు. కామ్రేడ్ మడెం లక్ష్మి సంతాప సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ముందుగా మడం లక్ష్మి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ మడెం లక్ష్మి పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారిని అన్నారు. అమరవీరులు కుంజ బుజ్జి, సున్నం రాజయ్య, ఆవుల నాగమయ్య, పాయం సీతమ్మల బాటలోనే కడవరకు సాగుతానని అనేక సందర్భాల్లో ఆమె తెలిపిందని అన్నారు. సిపిఎం వార్డ్ మెంబర్గా 13వ వార్డు అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారని గ్రామపంచాయతీ పాలకమండలి సమావేశాల సందర్భంగా ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారని అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ తన స్వగ్రామంలో పల్లూరు లో ఉంటూ గత మూడు రోజుల క్రితం భద్రాచలం వచ్చి వడ దెబ్బతో మృతి చెందిందని, ఇంటిలో ఎవరూ లేకపోవడంతో రెండు రోజుల తర్వాత తన ఇంటి నుండి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పార్టీ నాయకత్వానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమె మృతదేహాన్ని స్వగ్రామం కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు. తుది శ్వాస వరకు నీతి, నిజాయితీగా నమ్ముకున్న సిద్ధాంతం కోసం పనిచేసిన కామ్రేడ్ లక్ష్మి స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంతాప సభలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు సీనియర్ నాయకులు బీబీజీ తిలక్, ఎన్ వి ఎస్ నారాయణ,పట్టణ కమిటీ సభ్యులు యు జ్యోతి, కుంజ శ్రీనివాస్, డి రాఘవయ్య, కోరాడ శ్రీనివాస్, కొలగాని రమేష్, కనక శ్రీ, కాపుల దుర్గారావు, సత్యవతి, సీత తదితరులు పాల్గొన్నారు..



# జమ్మూ- కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి బాధాకరం.

- ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన ర్యాలీని చేసిన సెయింట్ పీటర్ చర్చ్, రుద్రంపూర్ సంఘం.
- సంఘ కాపరి పి.అనిల్ కుమార్, సెక్రెటరీ రవి రత్న రాజుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ.
- పాల్గొన్న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చుంచుపల్లి, ప్రతినిధి, ( సాయి కౌశిక్ ), ఏప్రిల్ 27,**సూచిపల్లి మండలం రుద్రంపూర్ సెయింట్ పీటర్ చర్చ్, సంఘంలో ఆదివారం ఆరాధన అనంతరం సెయింట్ పీటర్ చర్చ్ సంఘ కాపరి పి.అనిల్ కుమార్, సెక్రెటరీ రవి రత్నరాజుల ఆధ్వర్యంలో ఇటీవల జమ్మూ-కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదూల దాడిలో భారతీయులు నేపాల్ దేశస్తులు ఉన్నారని ఉగ్రవాదులు అన్యాయంగా పర్యాటకులను కాల్చి చంపారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి దాడులు చాలా బాధాకరమని అన్నారు. ఈ ర్యాలీలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు సంఘస్థులు పాల్గొన్నారు.

# కమ్మ యోజీ జ్ఞాపకార్థం శ్రీ విద్యాభ్యాస పాఠశాలకు 50 కిలోల బియ్యం పంపిణీ.

- విద్యార్థిని విద్యార్థులకు సహపంక్తి భోజనాలు నిత్యవసర వస్తువులు అందజేత.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27,**
ఏలూరు జిల్లా గురువాయిగూడెం గ్రామానికి చెందిన కమ్మ వెంకటరత్నారావు విమలమ్మ దంపతుల ప్రథమ కుమార్తె మక్కిన రమేష్ సతీమణి యోజి (యామిని) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం మణుగూరు మండలం సంతోష్ నగర్ లోని శ్రీ విద్యాభ్యాస (పూర్వ బాలవెలుగు) పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలకు యాభై కిలోల బియ్యాన్ని, నిత్యవసర వస్తువులను వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ యోజీ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు మరియు భర్త రమేష్ సహకారంతో ప్రతి సంవత్సరం బాల వెలుగు పాఠశాల లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్షర యోజి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి సహాయ సహకారాలు అందించిన పట్ల అభినందించారు. వారి కుటుంబ సభ్యులకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సభ్యురాలు జమీలా బేగం, సామాజిక సేవా కార్యకర్త అంగోత్ మంగీలాల్ శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి ,కిరణ్ కుమార్, ఉపాధ్యాయిని సుహాసిని దేవి సిబ్బంది సుజాత, రాధా తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పిల్లలు వేసవి శిబిరాన్ని సద్వినియోగ పర్చుకోవాలి.

- జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్.



సీ కే న్యూస్ :సింగరేణి కాలరీస్ ఆధ్వర్యం లో భద్రాద్రి స్టేడియం పివి కాలనీ శనివారం 5.30 గంటలకు సింగరేణి ఉద్యోగుల బాలబాలికలకు పలు క్రీడా శిక్షణాల నిమిత్తం వేసవి శిక్షణ తరగతులు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రారంభించబడినవి.

ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గ%శీ% రామచందర్ మాట్లాడుతూ..... సింగరేణి కుటుంబాల బాల బాలికలు సెల్ ఫోన్లు వినియోగిస్తూ వేసవి సెలవులను వృధా చేసుకోకుండా వారికి క్రీడల పట్ల ఆసక్తి నైపుణ్యం పెంపొందించడం గాను ది. 26.04.2025 నుండి 20.05.2025 వరకు ఫుట్బాల్ , అథ్లెటిక్స్ వాలీబాల్, కరాటే మరియు బాస్కెట్ బాల్ విభాగాలలో వేసవి శిక్షణలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలు శారీరిక ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని చురుకుదనాన్ని సమయస్ఫూర్తి నైపుణ్యాన్ని ఎంతగానో పెంచుతాయి. పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు దోహదపడి ఈ శిక్షణ శిబిరంలో సింగరేణి ఉద్యోగులు 18 సంవత్సరాల లోపు వయసు గల తమ పిల్లలను అధిక సంఖ్యలో చేర్పించిన ద్వారా వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోపరుచుకోవలసినదిగా తెలియజేశారు. అనంతరం క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఎంతో ఉత్సాభరితంగా జరిగిన ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సలగల రమేష్ కార్యదర్శి డబ్ల్యూ పి ఎస్ మరియు జిఏ పి.బి. అవినాష్ , ప్రాతినిధి సంఘం నాయకులు వి. కృష్ణంరాజు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్ వెస్లీ, కోచ్ లు, సింగరేణి ఉద్యోగుల బాలబాలికలు, తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం జరగనున్న ప్రజావాణి రద్దు.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 27, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా భూభారతి అవగాహన సదస్సులు నిర్వహించుటలో జిల్లా యంత్రాంగం మరియు అధికారులు నిమగ్నమై ఉన్నందున సోమవారం 28-04-2025 ప్రజావాణి రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలందరూ గమనించి దరఖాస్తులు ఇవ్వడానికి ఐ డి ఓ సి కార్యాలయానికి రావద్దని సూచించారు.

# ఉగ్ర దాడికి నిరసనగా క్రొవొత్తుల ర్యాలీ చందయిపేటలో



ఏప్రిల్ 27, (సీ కే న్యూస్) చేగుంట : కాశ్మీర్ లో జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా ఆదివారం నాడు చేగుంట మండల్ పరిధిలోని చందాయి పెట్ గ్రామంలో గ్రామస్తులు ఆదివారం రాత్రి క్రొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి చర్యలు ఇక ముందు జరుగకుండా కేంద్ర ప్రభుత్వం గట్టిగా జవాబు చెప్పాలన్నారు. మృతుల కు శాంతి చేకూరాలనీ, వారి కుటుంబాలు కు ధైర్యం ప్రసాదించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమం వివిధ పార్టీల నాయకులు, వివిధ సంఘాల అధ్యక్షులు, మైనార్టీ నాయకులు, యువకులు,తదితరులు పాల్గొన్నారు

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ... తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ లు.

**భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం**

**నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం, రాజేశ్వరపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్లు.**




సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం/నేలకొండపల్లి, ఏప్రిల్ -27:భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ లు అన్నారు. ఆదివారం నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం, రాజేశ్వరపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు

హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా రామచంద్రాపురం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 24, రాజేశ్వరపురం గ్రామ రెవెన్యూ సదస్సులో 182 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల ఆర్ఐలు రవి, మధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సంస్థాగత నిర్మాణంపై జిల్లా స్థాయి సమావేశం

- **జిల్లా పి సి సి అబ్జర్వర్లు శాసనసభ సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, బత్తిన శ్రీనివాసరావు**
- **మొన్న జరిగిన ఎన్నికలలో ఖమ్మం జిల్లాలో అత్యధిక స్థానాలు గెలిపించిన నాయకులకు,కార్యకర్తలకు ,అభిమానులకు ధన్యవాదాలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**



సికె న్యూస్ ప్రతినిధి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అధ్యక్షతన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా బ్లాక్,మండల, పట్టణ అధ్యక్షులగార్లతో మరియు ముఖ్య నాయకులతో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్,వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్,వరంగల్ శాసనసభ సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, బత్తిన శ్రీనివాసరావు గార్లు. ముందుగా రాష్ట్ర జాతీయ గీతాన్ని ఆలపించననైనది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పార్టీ సంస్థాగత నిర్మాణం లో భాగంగా ఖాళీగా ఉన్న అన్ని కార్పొరేషన్ సంస్థలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్టు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుందని. తెలిపారు .గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశంలో ,గ్రామశాఖ, మండల, పట్టణ, బ్లాక్ స్థాయి కమిటీలకు సుమారు 5గురి పేర్లతో ప్రతిపాదనలు పంపాలని, అట్టివారు పార్టీ కొరకు అహర్నిశలు కష్టపడి పనిచేసేవారిని సూచించాలని, పార్టీ పదవులలో ఉండి పార్టీ కొరకు పనిచేయాలని, పని చేయలేనివారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని, పార్టీని గ్రామస్థాయి నుండి పటిష్ట పరచాలని కోరారు. అనంతరం రాష్ట్ర జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కో ఆర్డినేటర్ పులి అనిల్ కుమార్ గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంపై సవివరంగా వివరించారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి మన జిల్లా నుండి అత్యధిక స్థానాలు అందించిన శ్రేణులకు పేరు,పేరున దన్యవాదాలు తెలిపారు, అదే విధంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో మీ అందరూ భాగస్వాములై ఈ ప్రక్రియ పూర్తి త్వరిత గతిన పూర్తి చేసి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ శ్రేణుల సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సత్తుపల్లి శాసనసభ సభ్యులు మట్టా రాగమయి, వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాసు నాయక్, మాజి శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు,పాలేరు నియోజకవర్గ జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కో ఆర్డినేటర్ రాష్ట్ర రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కో ఆర్డినేటర్ మన్నే సతీష్, రాష్ట్ర చేనేత, హస్త కళల అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ దొండపాటి వేంకటేశ్వరరావు,పి సి సి అదికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం,సిటీ కాంగ్రెస్ కమిటీ అద్యక్షులు మహ్మద్ జావేద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటి మేయర్ ఫాతిమా ముక్తార్ జోహార,జిల్లా అనుబంధ సంఘ అద్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, వేజెండ్ల సాయికుమార్,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, రాష్ట్ర ఓ బి సి నాయకులు హారికా నాయుడు గార్లు మరియు పి సి సి సభ్యులు, బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు, నగర కార్పొరేటర్లు, మాజి మున్సిపల్ చైర్మన్ గార్లు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 25 వ బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ఏప్రిల్ 27 (సీ కే న్యూస్)చెగుంట :బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం నాడు బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభకు బయలుదేరిన పొలంపల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పోలంపల్లి గ్రామంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, యాట సిద్ధిరాములు పార్టీ జెండను ఆవిష్కరించి, బిఆర్ఎస్ పార్టీ నిదానాలతో, బహిరంగ సభకు పోలంపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బయలుదేరారు వారు మాట్లాడుతూ, కెసిఆర్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని వారు అన్నారు నీళ్ళు నిధులు నియమకాలు ఇలా చెప్పుకుంటూ పోతే కెసిఆర్ తెలంగాణ పులిబిడ్డ రైతు బాంధవుడు, కల్యాణ లక్ష్మి షాది ముబారక్, రైతు బీమా, కాళేశ్వరం మల్లన్నసాగర్, తెలంగాణ వస్తే, చీకటి అవుతుందని చెప్పినవారు, తెలంగాణ కు 24 అవర్స్ కరెంట్ తెచ్చిన ఘనత కెసిఆర్ ది, తెలంగాణ ప్రజలు మళ్ళీ కెసిఆర్, వస్తేనే సంతోషంగా ఉంటారు అని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యాట సిద్దిరాములు, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కొండి మల్లేశం, వెన్నెలిసత్యం, పులిమామిడి రాజు, మాజీ సర్పంచ్ చౌడం నాగమణి, యూత్ నాయకులు, యాట బాలకృష్ణ, చింతకాయల కృష్ణ, కార్యకర్తలు యాట అంజి, గరిగే వెంకటేష్, చింతకాయల కిషన్, పాల్గొన్నారు,

# ఉచిత వైద్య శిభిరంలో పాల్గొన్న: కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..



ఏప్రిల్ 27 (సీ కే న్యూస్)హయత్ నగర్ లోని కమలా నగర్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం సభ్యులు బృంగి హస్పటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరం లో ముఖ్య అతిధిలుగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసులో పెద్దవారైన్నపటికి ప్రతినిత్యం సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమలా నగర్ సీనియర్ సిటిజన్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క వైద్య శిభిరంలో బిపి (రక్తపోటు), షుగర్, వివిధ వైద్య పరీక్షలు చైయడం జరుగుతుందని, కావున కాలనీవాసులందరు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కాలనీవాసులకి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమలా నగర్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సారంగం, సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# 25 వ బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ఏప్రిల్ 27 (సీ కే న్యూస్)చెగుంట : బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం నాడు బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభకు బయలుదేరిన పొలంపల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పోలంపల్లి గ్రామంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, యాట సిద్ధిరాములు పార్టీ జెండను ఆవిష్కరించి, బిఆర్ఎస్ పార్టీ నిదానాలతో, బహిరంగ సభకు పోలంపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బయలుదేరారు వారు మాట్లాడుతూ, కెసిఆర్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని వారు అన్నారు నీళ్ళు నిధులు నియమకాలు ఇలా చెప్పుకుంటూ పోతే కెసిఆర్ తెలంగాణ పులిబిడ్డ రైతు బాంధవుడు, కల్యాణ లక్ష్మి షాది ముబారక్, రైతు బీమా, కాళేశ్వరం మల్లన్నసాగర్, తెలంగాణ వస్తే, చీకటి అవుతుందని చెప్పినవారు, తెలంగాణ కు 24 అవర్స్ కరెంట్ తెచ్చిన ఘనత కెసిఆర్ ది, తెలంగాణ ప్రజలు మళ్ళీ కెసిఆర్, వస్తేనే సంతోషంగా ఉంటారు అని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యాట సిద్దిరాములు, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కొండి మల్లేశం, వెన్నెలిసత్యం, పులిమామిడి రాజు, మాజీ సర్పంచ్ చౌడం నాగమణి, యూత్ నాయకులు, యాట బాలకృష్ణ, చింతకాయల కృష్ణ, కార్యకర్తలు
యాట అంజి, గరిగే వెంకటేష్, చింతకాయల కిషన్, పాల్గొన్నారు,

## టైమింగ్ లో ఇండిగో టాప్.. ఏడాదిలో ఫ్లైట్ జర్నీల వృద్ధి ఎంతంటే?



దేశంలో విమానయానం అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా మార్చి నెలకు సంబంధించి దేశ వ్యాప్తంగా సాగిన విమాన ప్రయాణాలకు సంబంధించిన నివేదిక సిద్ధమైంది. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది అదే నెలలో వృద్ధి రేటు 8.79 శాతం ఉండటం గమనార్హం. దీనికి సంబంధించిన అధికారిక గణాంకాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ మార్చి మొత్తం కలిపి 1.33 కోట్ల మందికి సేవలు అందించినట్లుగా పేరకొన్నారు. దేశీయ ప్రయాణికులకు సంబంధించి తాజా రిపోర్టులో పేర్కొన్న అంశాల్ని చూస్తే.. మార్చిలో మొత్తం దేశీయ ప్రయాణాల్లో ఇండిగో టాప్ లో నిలిచింది. ఈ సంస్థకు చెందిన విమానాల్లో 93.1 లక్షల మంది ప్రయాణాలు చేశారు. మొత్తం మార్కెట్ వాటాలో ఇండిగో వాటా 64 శాతం. ఆ తర్వాతి స్థానంలో ఎయిర్ ఇండియా గ్రూపు నిలిచింది. ఈ సంస్థ కింద ఎయిర్ ఇండియా.. ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ బ్రాండ్లు ఉన్నాయి. మార్చిలో 38.8 లక్షలమంది ప్రయాణికుల్ని చేరవేయటం ద్వారా 26.7 శాతం వాటానుసొంతం చేసుకుంది. ఈ రెండు సంస్థల తర్వాత ఆకాశ ఎయిర్ 7.2 లక్షల మంది ప్రయాణికుల్ని వారి గమ్యస్థానాలకు చేరవేయటం ద్వారా ఆరు శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. ఇక.. స్పైస్ జెట్ విషయానికి వస్తే 4.8 లక్షల మంది ప్రయాణికుల్ని వారి గమ్యస్థానాలకు చేరవేయటం ద్వారా 3.3 శాతం వాటాను సొంతం చేసుకుంది. టైమింగ్ విషయంలో ఇండిగో టాప్ గా నిలిచింది. కచ్చితమైన సమయ వేళల్ని పాటించే విషయంలో ఇండిగో 88.1 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో ఆకాశ ఎయిర్ 86.9 శాతంలో నిలిచింది. ఎయిరిండియా గ్రూపు 82 శాతంతో మూడో స్థానంలో.. స్పైస్ జెట్ 72.1శాతంతో తర్వాతి స్థానంలో నిలిచింది.

## విష్ణు వర్సెస్ గంటా.. లడాయి ఇప్పటిది కాదుగా ..!



ఇద్దరూ కూటమి నాయకులే. ఇద్దరూ సీనియర్లే. కానీ.. రోడ్డున పడ్డారు. మీడియా చూస్తోందన్న విషయాన్ని కూడా మరిచి.. వాదులాడుకున్నారు. ఈ వ్యవహారం.. కూటమి పార్టీల్లో ఉన్న అంతర్గత కుమ్ములాటలను పట్టి చూపింది. అంతేకాదు.. సీనియర్ల మధ్యే వివాదాలు రోడ్డెక్కడం.. నువ్వెంత? అంటూ.. వ్యాఖ్యలు చేసుకోవడం వంటివి అంతర్గతంగా ఉన్న కుమ్ములాటలను రోడ్డున పడేసినట్టు అయింది.ఈ వ్యవహారం.. ఇక్కడితో పోతుందా? అనేది ప్రశ్న. కానీ.. గతంలో ఉన్న అనుభవాలను చూస్తే.. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మధ్య పాత వివాదాలు కూడా ఉన్నాయి. మంత్రిగా గంటా ఉన్న సమయంలో కూడా.. విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ సమయంలో పాఠశాలలకు వేసిన రంగులు, సున్నాలు, కొన్న ఫర్నిచర్ విషయంలో అవినీతి జరిగిందని విష్ణు ఆరోపించారు. ఇదేదో బయట జరిగిన వ్యవహారం కాదు. అసెంబ్లీ సాక్షిగానే అప్పట్లో విష్ణుకుమార్ చిర్రెత్తేలా మాట్లాడారు. పాఠశాల విద్యలో అవినీతి.. పాఠాలు నేర్పుతున్నారని సభలోనే వ్యాఖ్యానించారు. దీనిపై అప్పట్లో నాలు గు రోజుల పాటు గంటా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అప్పట్లోనే సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పరిణామాలే.. ఇప్పుడు గంటాకు అవకాశం లేకుండా చేసిందన్న ఆవేదన కూడా ఆయన లో ఉంది. ఈ పరిణామాలకు తోడు.. తాజాగా మరోసారి.. గంటా కేంద్రంగానే విష్ణు చక్రం తిప్పారు. విశాఖలోని ఫిలిం క్లబ్ భూముల వ్యవహారంపై విచారణ కోరుతూ.. కలెక్టర్‌కు నివేదిక పంపించారు. ఇదే .. ఇప్పుడు ఇరువురి మధ్య వివాదానికి దారితీసింది. అంతేకాదు.. రోడ్డుమీదే ఒకరిపై ఒకరు వ్యాఖ్యలు చేసుకునే దాకా వచ్చింది. ఇప్పటికైనా.. చంద్రబాబు జోక్యం చేసుకుని సరిదిద్దక పోతే.. వీరి వివాదం జిల్లా వ్యాప్తంగా వ్యాపించే అవకాశం ఉంటుందని అంటున్నారు. మరి ఏం చేస్తారో చూడాలి.

## గుంటూరు మేయర్ పీఠానికి ఎన్నిక.. వేడెక్కిన పాలిటిక్స్ ..!

గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ పీఠానికి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో రాజకీయాలు హీటెక్కాయి. కాగా.. ఈ పదవికి కూటమి తరపున టీడీపీ నాయకుడు కోవెలమూడి రవీంద్ర.. ఉరఫ్ నానీ పేరు ఖరారైంది. ఈ క్రమంలో ఈ నెల 28 వ తేదీన మేయర్ ఎన్నిక నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. మేయర్ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల అధికారి, సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ ను ఎన్నికల కమిషన్. నియమించింది. తేజ ఆదేశాలతో నగరపాలక అధికారులు మేయర్ ఎన్నిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న మేయర్ ఎన్నిక ఉంటుందని ఇప్పటికే కార్పొరేటర్లు, ఎక్ అఫీషియో సభ్యులకు సమాచారం అందించారు. మేయర్ అభ్యర్థిగా రవీంద్ర పేరును ఎంపిక చేశారు. టిడిపికి చెందిన నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి నానీ పేరును పార్టీ నేతలు ఖరారు చేశారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు శాసనసభ్యులు నసీర్, గల్లా మాధవి, రామాంజనేయులుతోపాటు ఒక మంత్రి సోదరుడుతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే నాని పేరును ఖరారు చేశారు. చిత్రం ఏంటంటే.. ఈ పదవికి రెండో పేరు ప్రతిపాదనలు కూడా రాలేదని తెలిసింది. దీంతో కూటమి నేతలు బీఫారం నానికే ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆరు స్థాయీ సంఘం పదవులను కైవసం చేసుకున్న ఊపుతో ఉన్న టిడిపి మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని కూటమి పక్షాలు పట్టుదలతో ఉన్నాయి.

# మాజీ మంత్రులు కనిపించుటలేదా ..?




రాష్ట్రంలో వైసీపీ నాయకులు చాలా మంది ఓడిపోయారు. వీరిలో మంత్రులు కూడా ఉన్నారు. అయితే.. ఎంత ఓడిపోయినా.. ప్రజలకు చేరువ అయ్యేందుకు నాయకులు ప్రయత్నిస్తారు. కానీ, వైసీపీలో మంత్రు లుగా పనిచేసిన చాలా మంది నాయకులు ప్రజలను తప్పించుకుని తిరుగుతున్నారు. గతంలో టీడీపీ నాయకులు ప్రతిపక్షంలోకి వచ్చిన ఆరుమాసాల్లోనే పుంజుకున్నారు. ప్రజల మధ్య తిరిగారు. కానీ..

ఉదాహరణకు.. గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన నారాయణ స్వామి.. గడ ప దాటడం లేదు. నిజానికి తాను తప్పుకొని తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకున్నా.. విజయం దక్కించు కోలేక పోయారు. ఆ సమయంలో ఆయన ఓడినా.. ప్రజల మధ్యే ఉంటానని చెప్పారు. కానీ, ఇప్పుడు ఎక్క డా కనిపించడంలేదు. పోనీ.. ఆయన కుమార్తె అయినా.. కనిపిస్తున్నారా? అంటే.. అది కూడా లేదు.

కడప నుంచి ప్రాధాన్యం వహించిన అంజాద్ బాషా.. వైసీపీలో మైనారిటీ శాఖను చూశారు. గత ఎన్నికల్లో ఓడిపోయారు. కానీ.. ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. తన సోదరుల కేసులతోనే ఆయన సరిపుచ్చు కుంటున్నారు. నిజానికి కడపలో వైసీపీ నాయకులపై కేసులు నమోదవుతున్నాయి. కానీ.. బాషా మాత్రం ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. ఇక, విజయవాడ కు చెందిన పశ్చిమ మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు.. కేసుల భయంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

అప్పట్లో దేవాలయ శాఖను చూసిన వెల్లంపల్లి హయాంలోనే... విజయవాడ దుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు మాయమయ్యాయి. విజయనగరంలోని రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం శిరచ్ఛేదం కూడా జరిగింది. ఇక, అంతర్వేది రథం దగ్ధమైంది. ఈ కేసులు ఆయనకే చుట్టుకుంటున్నాయి. దీంతో తాను రాజకీయంగా యాక్టివేట్ అయితే.. ఇబ్బందులు తప్పవని.. రాజకీయాలు తర్వాత చేసుకోవచ్చని నిర్ణయించుకున్నట్టు ఆయన గురించి పెద్ద టాక్ నడుస్తోంది. మొత్తానికి తలకో రకంగా మాజీ మంత్రులు ఉన్నారు.

# హైదరాబాద్ లో హైఅలెర్ట్.. అసలు నిజం ఇదీ




దేశంలో ఉగ్రవాద చర్యలు జరిగినప్పుడు భద్రతా సంస్థలు ముందుజాగ్రత్తగా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయడం సహజం. అయితే, కొన్నిసార్లు అతి ఉత్సాహం చూపే కొన్ని మీడియా ఛానెళ్లు, సోషల్ మీడియా గ్రూపులు వీక్షకుల సంఖ్యను పెంచుకోవడం కోసం హై అలర్ట్‌లు, ఉగ్రవాద బెదిరింపుల గురించిన వార్తలను ప్రచారం చేస్తుంటాయి. ఇలాంటిదే హైదరాబాద్ విషయంలోనూ జరిగింది.కాశ్మీర్‌లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో, కేంద్ర నిఘా సంస్థల నుంచి అందిన హెచ్చరికల దృష్ట్యా హైదరాబాద్‌ను హై అలర్ట్‌లో ఉంచినట్లు వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియాలో వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అయ్యాయి. తెలంగాణకు 'హై అలర్ట్ జోన్'గా ప్రకటించారని, ప్రత్యేక బృందాలను నియమించారని, తెలుగు రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేశారని కూడా కొన్ని తప్పుడు సందేశాలు వ్యాప్తి చెందాయి.అయితే, ఈ ఊహాగానాలలో ఎలాంటి నిజం లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ఇటువంటి వదంతులను నమ్మవద్దని, ఫార్వార్డ్ చేయవద్దని పోలీసులు ప్రజలను కోరారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎప్పుడూ అధికారిక వనరులపైనే ఆధారపడాలని హైదరాబాద్ పోలీసుల ప్రకటన పేర్కొంది.సోషల్ మీడియాలో చార్మినార్ చిత్రాన్ని ఉంచి, హైదరాబాద్ ఉగ్రవాద బెదిరింపు కారణంగా హై అలర్ట్‌లో ఉందని పేర్కొంటూ కొన్ని పోస్టులు కనిపించాయి. ఈ సోషల్ మీడియా ప్రచారం కూడా పూర్తిగా అవాస్తవమని, దీనిపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసులు స్పష్టం చేశారు.ఏదైనా అలర్ట్ లేదా ముందుజాగ్రత్త చర్యలు ఉంటే, వాటిని హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా అధికారికంగా తెలియజేస్తారని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని పోలీసులు తెలిపారు. ప్రజలు ఇటువంటి తప్పుడు వార్తలను నమ్మి అనవసర భయాందోళనకు గురికావద్దని సూచించారు. అధికారిక సమాచారం కోసం హైదరాబాద్ పోలీస్ కమ్యూనికేషన్లను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

# చీర్‌లీడర్ల సెలెక్షన్ ఎలా జరుగుతుందో తెలుసా?



ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రసవత్తరంగా కొనసాగుతోంది. ఈ 45రోజులకు క్రికెట్ ప్రియులకు పండుగనే చెప్పాలి. మ్యాచ్ ల సమయంలో ఫోర్లు, సిక్సర్లు పడిన వెంటనే కెమెరా దృష్టి మొదట చీర్‌లీడర్స్‌పైన పడుతుంది. ఈ చీర్‌లీడర్స్ తమ జట్టు వికెట్లు లేదా ఫోర్లు, సిక్సర్లను సెలబ్రేట్ చేయడానికి ఉంటారు. మ్యాచ్ ఉత్సాహాన్ని నిలబెట్టడానికి, ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి వారి ఉత్సాహం తగ్గకుండా చూసేందుకు ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో చీర్‌లీడర్స్‌ను నియమిస్తారు. అంతేకాకుండా, చీర్‌లీడర్స్ ఆటగాళ్లలో కూడా ఉత్సాహాన్ని నింపే పని చేస్తారు. అయితే చీర్‌లీడర్‌గా మారడానికి ఎవరు ఇంటర్వ్యూ చేస్తారు.. దాని పూర్తి ప్రాసెస్ ఏమిటో మీకు తెలుసా ? ఏదైనా ఐపీఎల్ ఫ్రాంచైజీలో చీర్‌లీడర్ల సెలక్షన్ ప్రక్రియ చాలా కఠినంగా ఉంటుంది. టీమ్ మేనేజ్‌మెంట్ లేదా స్పాన్సర్‌లు వీరిని ఇంటర్వ్యూ చేస్తారు. ఈ ఇంటర్వ్యూలు వీడియో లేదా పర్సనల్ గా నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ సమయంలో చీర్‌లీడర్ డ్యాన్స్, మోడలింగ్ నైపుణ్యాలను టెస్ట్ చేస్తారు. దీనితో పాటు, వేలాది మంది ప్రేక్షకులు నిండిన స్టేడియంలో చీర్‌లీడర్స్ ఆటగాళ్ల ఉత్సాహాన్ని ఎలా పెంచగలరో కూడా పరిశీలిస్తారు. చీర్‌లీడర్‌లను ఎన్నుకునేటప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ వారిలో ఆటగాళ్లు, జట్టుతో సఖ్యతను ఏర్పరచుకునే కెపాసిటీ వారికి ఉందో లేదో కూడా చూస్తుంది. అలాగే వారు జట్టును మెరుగుపరచడంలో ఏ విధంగా సహాయపడగలరో కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఆదాయం విషయానికి వస్తే చీర్‌లీడర్‌లు లక్షల రూపాయల వరకు సంపాదిస్తారు. మీడియా నివేదికల ప్రకారం.. ఒక సీజన్‌లో వారి సంపాదన మూడు నుండి నాలుగు లక్షల రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ కూడా ఉండవచ్చు. చీర్‌లీడర్‌లు ధరించే దుస్తులను పూర్తిగా స్పాన్సర్‌లను దృష్టిలో ఉంచుకుని తయారు చేస్తారు. ఎందుకంటే వాటి పూర్తి ఖర్చును స్పాన్సర్‌లే భరిస్తారు. వారి దుస్తులలో టీమ్, కంపెనీల లోగోలు ఉంటాయి.

# ఆ ఏపీ మంత్రి అంతే.. మారరంటే మరరా...?



కూటమి సర్కారులోని కొందరు మంత్రులపై పబ్లిక్ టాక్ భిన్నంగా ఉంది. కొందరు పనిచేస్తుంటే.. మరి కొందరు ప్రచారానికి పరిమితం అవుతున్నారని ప్రజలే చెబుతున్నారు. మరికొందరు కేవలం ప్రతిపక్షంపై విమర్శలు చేసేందుకు మాత్రమే పరిమితంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఉదాహరణకు నిమ్మల రామానాయుడు గురించిపాజిటివ్ టాక్ ఉంది. ఆయనను పనిరాక్షసుడిగా పేర్కొంటున్నారు. అదేసమయంలో కొండపల్లి శ్రీనివాస్ వ్యవహారం.. హైప్రొఫైల్‌గా ఉందని ప్రజలే చెబుతున్నారు. ఆయన ఎవరినీ కలవరు. కలిసినా... రెండు మూడు నిమిషాలకు మించి మాట్లాడడం లేదు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ఉన్నారని చెబుతున్నారట. ఇక, హోం మంత్రి అనిత వ్యవహారం.. హోం శాఖలోనే చర్చగా మారింది. విషయంపై పెద్దగా పట్టులేదని ప్రత్యక్షంగా ఆమె గురించి కామెంట్లు వినిపిస్తున్నాయి. సత్యకుమార్ యాదవ్ బీజేపీ నాయకుడే అయినా.. ఆయన గురించి కొంత పాజిటివ్ టాక్ మరింత ఎక్కువ గా నెగిటివ్ టాక్ వినిపిస్తోంది. ఆయన వ్యవహారం కూడా.. పార్టీలోనూ.. ప్రభుత్వంలోనూ చర్చగానే ఉంది. మహిళా మంత్రుల్లో సవిత నియోజకవర్గంలో మైనస్ అవుతున్నారు. రాష్ట్రంలో ప్లస్ అవుతున్నారు. ఆమె వయసు రీత్యా కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. మంత్రిగా బాగానే పనిచేస్తున్నారు. కానీ, నియోజకవర్గంలో రాజకీయాలను లైన్‌లో పెట్టలేక పోతున్నారని ప్రజలు చెబుతున్నారు.

ఇక, అన్ని విషయాలను మంత్రి నారా లోకేష్ చూస్తున్నారన్నది మరోటాక్. ఇది మంచిదే అయినా.. ప్రతి విషయం ఆయనకు చెప్పాలని మంత్రులు

చెబుతుండడం చూస్తే.. కొంత వరకు.. ఇబ్బందిగానే ఉంది. ఇటీవల ఉమ్మడి గుంటూరుకు చెందిన మంత్రి ఒకరు.. మంత్రిని అడిగి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కానీ, ఆయన సీనియర్ నాయకుడు. దీంతో మంత్రుల వ్యవహారం ఇంతేనా? అనేది పబ్లిక్ టాక్. మరి ఇది ముమ్ముందు ఎటు దారి తీస్తుందో చూడాలి.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

# వేసవిలో మెరిసే చర్మం కోసం స్పెషల్ జ్యూస్

**వేసవిలో చర్మ కాంతికి సహజ పైనాపిల్ పానీయం**
**పోషకాహార నిపుణుల సూచన**
**కొబ్బరి నీరు, పైనాపిల్, అల్లం, నిమ్మరసం వంటి పదార్థాలతో జ్యూస్**
**విటమిన్ సి, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో చర్మానికి మేలు**
**తక్కువ కేలరీలు, సహజమైన తీపి, సులభమైన తయారీ**

ఎండాకాలంలో తీక్షణమైన సూర్యకిరణాల వల్ల చర్మాన్ని నిర్జీవంగా మారిపోతుంది. చాలామంది ఎండలో తిరగ్గానే నల్లబడుతుంటారు. వేసవిలో చాలామంది సన్ టాన్ నుంచి తప్పించుకునేందుకు క్రీమ్ లు, లోషన్లు వాడుతుంటారు. కేవలం బయటి పూతలే కాకుండా, సరైన పోషణ లోపలి నుంచి అందాలని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ఒక అద్భుతమైన పైనాపిల్ పానీయాన్ని సూచిస్తున్నారు. ఇది వేసవిలో మీ చర్మానికి సహజమైన మెరుపును, ఆరోగ్యాన్ని అందిస్తుంది. ఈ పానీయం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, విటమిన్ సి, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. విశేషమేమిటంటే, ఇందులో కేవలం 70 కేలరీలు మాత్రమే ఉంటాయి మరియు కృత్రిమ చక్కెరలు ఉండవు. కొబ్బరి నీరు, పైనాపిల్ నుంచి వచ్చే సహజమైన తీపి మాత్రమే ఉంటుంది. మార్కెట్లో దొరికే చక్కెర పానీయాల కంటే ఇది చాలా ఆరోగ్యకరమైనది.

**ఈ పానీయంలోని ముఖ్య పదార్థాలు, వాటి ప్రయోజనాలు**

కొబ్బరి నీరు: సహజ ఎలక్ట్రోలైట్లతో డీహైడ్రేషన్‌ను తగ్గిస్తుంది, చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది.
పైనాపిల్: విటమిన్ సి, బ్రోమెలైన్ ఎంజైమ్‌లతో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి, చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది.
అల్లం: యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో రక్త ప్రసరణను మెరుగుపరిచి, చర్మానికి హాని చేసే టాక్సిన్స్‌తో పోరాడుతుంది.
నిమ్మరసం: విటమిన్ సి అందించి, శరీరాన్ని శుభ్రపరచడంలో (డీటాక్స్) సహాయపడుతుంది.
కారం, మిరియాలు, ఉప్పు (చిటికెడు): జీవక్రియను పెంచి, పోషకాల శోషణకు, ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు తోడ్పడతాయి.

**తయారీ విధానం**

ఒక గ్లాసు కొబ్బరి నీరు, రెండు పైనాపిల్ ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ తురిమిన అల్లం, ఒక నిమ్మకాయ రసం, చిటికెడు కారం, మిరియాల పొడి, రుచికి ఉప్పు కలిపి మిక్సీలో మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. సహజమైన ఫైబర్, ఎంజైమ్‌ల పూర్తి ప్రయోజనాల కోసం వడకట్టకుండా తాగడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**ఎప్పుడు తీసుకోవాలంటే...**

ఉదయం పూట లేదా వ్యాయామం తర్వాత ఈ రిఫ్రెషింగ్ డ్రింక్ తాగడం ఉత్తమం. ఈ వేసవిలో దీన్ని రోజూ అలవాటు చేసుకోవడం వల్ల మీ చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా మెరుస్తుంది, మీరు తాజాగా, శక్తివంతంగా ఉంటారు.

# టాటూలు వేయించుకోవడం సురక్షితమేనా?... నిపుణులు ఏం చెబుతున్నారంటే...!



పది మందిలో ప్రత్యేకంగా కనిపించాలనే మనస్తత్వం ఉన్న వాళ్లు టాటూలు వేయించుకుంటారు. అయితే, టాటూలు వేయించుకోవడం సురక్షితమేనా అనే అంశం చాన్నాళ్లుగా చర్చనీయాంశంగా ఉంది. టాటూలు వేసేందుకు ఉపయోగించే సూదులు అపరిశుభ్రంగా ఉండడం, ఒకరికి వాడిన సూదులు మరొకరికి వాడడం వంటి కారణాలతో హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి వైరస్ లు వ్యాపించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో, నిపుణులు ఏం చెబుతున్నారో ఓసారి చూద్దాం.

**టాటూ వేయించుకునే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు**

శరీరంపై టాటూ వేయించుకోవాలనుకునే ప్రదేశంలో వారం ముందు నుంచి మాయిశ్చరైజర్ రాయడం ప్రారంభించాలి.
చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తగినంత నీరు త్రాగాలి.
టాటూ వేయించుకునే నాలుగు రోజుల ముందు వరకు ఆ ప్రాంతంలో వాక్సింగ్ లేదా ఎపిలేషన్ చేయకూడదు.
సూర్యరశ్మి నుంచి చర్మాన్ని కాపాడుకోవాలి.
టాటూ వేయించుకునే 24 గంటల ముందు ఆల్కహాల్ లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించకూడదు.
అపాయింట్‌మెంట్‌కు ముందు బాగా తినాలి.

**టాటూ వేసిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు**

టాటూ వేసిన తర్వాత 10 రోజుల వరకు వ్యాయామం మరియు క్రీడలకు దూరంగా ఉండాలి. మూడు వారాల వరకు స్విమ్మింగ్, బీచ్‌లు, బాత్‌టబ్‌లు మరియు జాకుజీలను నివారించాలి. చర్మాన్ని ఎల్లప్పుడూ తేమగా ఉంచుకోవాలి. టాటూ ఆర్టిస్ట్ ఇచ్చిన సూచనలను పాటించాలి.

**టాటూలు సురక్షితమేనా?**

సరైన పద్ధతిలో, తగిన జాగ్రత్తలతో టాటూలు వేయించుకుంటే సురక్షితమే. టాటూ వేసే స్టూడియో పరిశుభ్రంగా ఉండాలి. రంగుల్లో కొన్ని రంగులు అలెర్జీ కారకాలను కలిగి ఉంటాయి. కాబట్టి రంగు టాటూ వేయించుకునే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు టాటూ వేయించుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

**ఏ టాటూలు ఎక్కువగా నొప్పి కలిగిస్తాయి?**

వేళ్ళపై, అరచేతుల్లో, పాదాలపై, మోకాళ్ళపై, మోచేతులపై, వెన్నెముకపై మరియు నడుముపై వేసే టాటూలు ఎక్కువగా నొప్పిని కలిగిస్తాయి. ముంజేతులు మరియు పక్కటెముకలపై వేసే టాటూలు తక్కువ నొప్పిని కలిగిస్తాయి.

**టాటూలు వెలిసిపోకుండా ఎలా నివారించాలి?**

కాలక్రమేణా టాటూ సిరా విచ్ఛిన్నమవుతుంది. టాటూలు వాటి సంతృప్తతను మరియు స్పష్టతను కోల్పోతాయి. సూర్యరశ్మి, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, టాటూ వేసే ప్రదేశం మరియు పరిమాణం వంటి అంశాలు కూడా టాటూ వెలిసిపోవడానికి కారణమవుతాయి. టాటూ వేసిన తర్వాత సన్‌స్క్రీన్ రాసుకోవడం వల్ల రంగు మారకుండా కాపాడుకోవచ్చు. కీళ్ళు మరియు చర్మపు ముడతలు దగ్గర చిన్న టాటూలు వేయించుకోకపోవడం మంచిది.

**ప్రస్తుతం ఏ టాటూలు ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్నాయి?**

యువత సాధారణంగా సన్నని గీతలతో ఉండే పాతకాలపు టాటూలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సైబర్ సిగిల్స్ కూడా ప్రస్తుతం చాలా ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుత ట్రెండ్ ఏమిటంటే టాటూలను ప్రదర్శన కోసం కాకుండా సొంత సంతృప్తి కోసం వేయించుకుంటున్నారు.

# పిల్లలు ఇలా ప్రవర్తిస్తుంటే... అర్థం ఏమిటో తెలుసా?

**ప్రతి ఇంట్లో పిల్లలు అల్లరి చేయడం సాధారణమే...**
**పిల్లల అల్లరిని నియంత్రించడానికి తల్లిదండ్రులు కోప్పడటమూ తెలిసిందే...**
**కొందరు తల్లిదండ్రుల తీరును బట్టి పిల్లలు ఎలా ప్రవర్తిస్తారనేది తేల్చి చెబుతున్న మానసిక నిపుణులు**



పిల్లలు అన్నాక అల్లరి చేయడం మామూలే. చాలా మంది తల్లిదండ్రులు పిల్లల అల్లరిని కట్టడి చేయడానికి ఏదో రకంగా ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరైతే మరీ తిట్టడం, కొట్టడం వరకు వెళుతుంటారు. అయితే, ఇలా తిట్టడం, కొట్టడం వల్ల పిల్లల ప్రవర్తనలో కొన్ని రకాల మార్పులు వస్తాయని పిల్లల మానసిక నిపుణులు చెబుతున్నారు. అత్యంత కఠినం (స్ట్రిక్ట్)గా వ్యవహరించే వారి పిల్లల్లో ప్రమాదకరమైన ప్రవర్తన అలవడుతుందని హెచ్చరిస్తున్నారు. పిల్లలపై తీవ్ర ఒత్తిడి, కఠినంగా వ్యవహరిండం వల్ల ఈ కింది లక్షణాలు ఏర్పడుతాయని సూచిస్తున్నారు.

**పిల్లల్లో మూడ్ స్వింగ్స్ సమస్య**

పిల్లల పట్ల తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరిస్తూ ఉంటే... పిల్లల్లో మూడ్ స్వింగ్స్ సమస్య తలెత్తుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్వేగాలను నియంత్రణలో ఉంచుకోలేకపోతారని... ఉన్నట్టుండి కోపగించుకోవడం, గట్టిగా అరవడం వంటి లక్షణాలు పెరిగిపోతాయని స్పష్టం చేస్తున్నారు.

**అన్నీ దాచిపెట్టే అలవాటు**

తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరిస్తే... వారికి భయపడి అన్ని విషయాలను దాచిపెట్టే అలవాటు పెంచుకుంటారని నిపుణులు చెబుతున్నారు. మంచి అయినా, చెడు అయినా ఓపెన్ గా చెప్పడానికి ఇష్టపడని వ్యక్తులుగా మారతారని స్పష్టం చేస్తున్నారు.

**ఎదురుతిరిగే మనస్తత్వం**

పిల్లలపై తీవ్రంగా ఒత్తిడి పెడితే, రూల్స్ పెడుతూ ఉంటే... ఎదురుతిరగడం, ఎదురు ప్రశ్నించడం మొదలవుతుందని నిపుణులు తేల్చి చెబుతున్నారు. తమ జీవితంపై పెత్తనం ఏమిటనే స్థాయికి ఇది చేరవచ్చని హెచ్చరిస్తున్నారు.

**ఆత్మవిశ్వాసం లేమి...**

తల్లిదండ్రుల కఠిన ప్రవర్తన వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం లోపిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల పిల్లలను తరచూ తిట్టడం, చెప్పినట్టు వినడం లేదని, ఆశించినట్టుగా చదవడం లేదని అతిగా ఒత్తిడి చేయడం మంచిది కాదని స్పష్టం చేస్తున్నారు.

**మానసికంగా ఆందోళన(యాంగ్జైటీ)కి లోనవడం...**

ఏవైనా చిన్న తప్పులు చేసినా తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించడం వల్ల పిల్లలు తీవ్ర మానసిక ఆందోళనకు (యాంగ్జైటీ)కి లోనవుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది దీర్ఘకాలంలో ప్రమాదకరంగా పరిణమిస్తుందని పేర్కొంటున్నారు.

**ఎవరితోనూ కలవలేకపోవడం...**

తల్లిదండ్రుల కఠిన ప్రవర్తన వల్ల పిల్లలు ఎవరితోనూ కలవక, ఒంటరితనాన్ని ఇష్టపడేవారిగా ం తయారవుతారని నిపుణులు చెబుతున్నారు. స్నేహితులనూ దూరం చేసుకుంటారని, భవిష్యత్తులో ఇంట్రావర్టులుగా మారతారని హెచ్చరిస్తున్నారు.

**ప్రోత్సాహం లేక వెనుకబడిపోవడం**

తరచూ ఇది చేయలేదు, అది చేయలేదు, సరిగా చదవడం లేదంటూ తీవ్రంగా ఒత్తిడి చేసే తల్లిదండ్రుల వల్ల పిల్లల్లో మోటివేషన్ లేకుండా పోతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ప్రోత్సాహం కరవై దేనిపైనా దృష్టిపెట్టక వెనుకబడిపోతుంటారని హెచ్చరిస్తున్నారు.

# పిక్‌టాక్ : స్టైలిష్ లుక్‌లో అందాల శృతి



కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ ఇండస్ట్రీలో ఇప్పటికే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. కమల్ కూతురు అనే బ్రాండ్ ఇమేజ్ ఆమెకు మొదటి నుంచి లేదు. సొంత ఇమేజ్‌తోనే, సొంత ప్రతిభతోనే నటిగా రాణిస్తూ, ఆఫర్లు దక్కించుకుంటూ వచ్చింది. మొదటి సినిమా హిందీలో చేయడంతో పాటు, మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. స్టార్ కిడ్స్ అంటే ఎంట్రీ మరోలా ఉంటుంది. కానీ శృతి హాసన్ అందరిలా కాదు. ఆమె ప్రత్యేకంగా సినిమాలు చేసింది, ప్రత్యేక పాత్రలు, ప్రత్యేక పాటల్లోనూ నటించడం ద్వారా పాన్ ఇండియా స్టార్ హీరోయిన్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. హిందీ సినిమా ఇండస్ట్రీలో నటిగా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత తెలుగు, తమిళ్ భాషల్లో నటించింది. తెలుగులో ఈమె నటించిన గబ్బర్ సింగ్ సూపర్ హిట్ అయింది. పవన్ తో చేసిన ఆ సినిమా శృతి హాసన్‌కు మొదటి సూపర్ హిట్ అనే విషయం తెల్సిందే. ఆ సినిమా తర్వాత బలుపు, ఎవడు, రేసు గుర్రం, శ్రీమంతుడు, క్రాక్ ఇలా చాలా సినిమాల్లో నటించింది. హీరోయిన్‌గా ఈమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద కొన్ని సూపర్ హిట్‌గా నిలవగా, కొన్ని నిరాశ పరిచాయి. అయినా ఈమె కెరీర్‌లో వరుస ఆఫర్లు దక్కించుకుంది. ఐటెం సాంగ్స్‌కి సైతం భారీ పారితోషికం దక్కించుకున్న అరుదైన ఘనత ఈమెకు దక్కింది అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ లో ఏకంగా 24 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న శృతి హాసన్ తాజాగా మరోసారి స్టైలిష్ అవతార్ లో ఫోటోలను షేర్ చేసింది. ఇతర హీరోయిన్స్‌కి చాలా భిన్నంగా ఈమె ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ ఉంటుంది. అందమైన ఫోటోలు, వీడియోలను ఈమె షేర్ చేయడం కాకుండా విభిన్నంగా ఉన్న ఔట్ ఫిట్‌లను ఈమె ధరించి వైరల్ అవుతూ ఉంటుంది. ఇలాంటి ఔట్ ఫిట్స్ కేవలం శృతి హాసన్‌కే సాధ్యం అంటూ చాలా మంది సెలబ్రెటీలు ముఖ్యంగా హీరోయిన్స్ అనుకుంటారు అంటే శృతి ఏ రేంజ్ స్టైలిష్ ఔట్ ఫిట్‌ను ధరిస్తుందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా విభిన్నమైన యాష్ కలర్ ఔట్ ఫిట్‌ను ధరించి, లూజ్ హెయిర్‌తో మెడలో యాష్ కలర్ పులి గోరును ధరించి ఉన్న శృతి హాసన్ స్టైల్ ఐకాన్‌గా కనిపిస్తుంది. సాధారణంగా హీరోయిన్స్ ఇలాంటి ఔట్ ఫిట్స్‌కి ప్రిపర్ చేయరు. కానీ ఈమె మాత్రం చాలా ధైర్యంగా ఇలాంటి ఫోటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ ఇలాంటి ఫోటోలతో మరింతగా పెరగడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈమధ్య కాలంలో తెలుగుతో పాటు, హిందీ, ఇతర భాషల్లోనూ కొత్త ప్రాజెక్ట్‌లకు కమిట్ అయింది.



**సాంప్రదాయ ఎరుపు మరియు క్రీమ్ దుస్తులలో అషు రెడ్డి మెరుస్తున్నాడు**

**సమంత ఇన్‌స్పైరింగ్ ఇన్‌స్టాగ్రామ్ కోట్‌లు మరియు పూజ్యమైన స్నాప్‌లు**



# 'విశ్వంభర'కు ఇది ప్లస్సా మైనస్సా?



మెగాస్టార్ చిరంజీవి కొత్త చిత్రం 'విశ్వంభర' మొదలైనపుడు ఎంత హైప్ వచ్చిందో తెలిసిందే. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకుడు కావడం.. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' తరహా ఫాంటసీ కథ కావడం.. యువి క్రియేషన్స్ భారీ బడ్జెట్లో ఈ సినిమాను నిర్మిస్తుండడంతో మెగా ఫ్యాన్స్ ఎగ్జైట్మెంట్ మామూలుగా లేదు. చిరుకు సెకండ్ ఇన్నింగ్స్‌లో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని దీని మీద అంచనాలు ఏర్పడ్డాయి. కానీ టీజర్ రిలీజయ్యాక మొత్తం కథ మారిపోయింది. అందులో పేలవమైన విజువల్ ఎఫెక్ట్స్, విజువల్స్ చూశాక సినిమా చుట్టూ నెగెటివిటీ ముసురుకుంది. దీంతో అప్పటిదాకా రెడీ అయిన విజువల్ ఎఫెక్ట్స్ కంటెంట్ అంతా పక్కన పెట్టి కొత్తగా వర్క్ చేయాల్సి వచ్చింది. ఈ కారణంగానే సినిమా నిరవధికంగా వాయిదా పడింది. అసలు వార్తల్లో లేకుండా పోయిన 'విశ్వంభర'ను మళ్లీ ప్రేక్షకుల దృష్టిలోకి తేవడానికి, హైప్ పెంచడానికి ప్రయత్నిస్తోంది చిత్ర బృందం. ఇందులో భాగంగానే ఇటీవల తొలి పాటను రిలీజ్ చేశారు. ఐతే అది యావరేజ్ అనిపించింది. తాజాగా ఈ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ బడ్జెట్ గురించి మీడియాకు సమాచారం ఇచ్చారు. ఏకంగా రూ.75 కోట్లు ఎఫెక్ట్స్ కోసమే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఐతే ఒకప్పుడు ఇలా వీఎఫెక్స్ బడ్జెట్ గురించి వెల్లడిస్తే ఆశ్చర్యపోయి దాని గురించి చర్చించుకునేవారు జనం. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. బాహుబలి, కల్కి సహా పలు భారీ చిత్రాల్లో హాలీవుడ్‌కు ఏమాత్రం తీసిపోని ఎఫెక్ట్స్ చూసేశారు ప్రేక్షకులు. పైగా 'విశ్వంభర' వీఎఫెక్స్ ఖర్చు ఈ స్థాయికి వెళ్లడం వెనుక వేరే కారణాలున్నాయనే అనుమానాలు కూడా ఉన్నాయి. ముందు రూపొందించిన వీఎఫెక్స్ కంటెంట్ అంటే పక్కన పడేసి మళ్లీ వర్క్ చేయడం వల్ల బడ్జెట్ బాగా పెరిగిందని భావిస్తున్నారు. కాబట్టే వీఎఫెక్స్ బడ్జెట్ ఇంత భారీగా అయిందంటే ప్రేక్షకుల్లో పెద్దగా ఎగ్జైట్మెంట్ కనిపించడం లేదు. కాబట్టే ఈ 75 కోట్ల వీఎఫెక్స్ బడ్జెట్ వార్త ప్లస్ అవుతుందని చెప్పలేని పరిస్థితి.